# వేంకటేశ్వరాలయంలో హిందూ సమ్మేళనం

**అల్లాదుర్గం, మే 16, ప్రభాతవార్త:**
ఈనెల17వతారీఖున మండలకేంద్రమైన అల్లాదుర్గంలోని శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయంలో హిందూ సమ్మేళనం(ధార్మిక చైతన్యసభ)ను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. హిందూధర్మ పరిరక్షణ, ప్రచారం, సమాజంలో ఐక్యతపెంపొందించే లక్ష్యంతో కార్యక్రమాన్ని ఏర్పాటుచేశామన్నారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సనాతనధర్మ ప్రచారకులు శీలంకోట ప్రవీణ్‌శర్మ హాజరవుతున్నారన్నారు. హిందూ ధర్మం, భారతీయసంస్కృతి, యువతలో ధార్మికచైతన్యం అంశాలపై శీలంకోట ప్రవీణ్ సందేశం ఇవ్వనున్నారన్నారు. కార్యక్రమంలో బొల్లి నర్సింలు పాల్గొని హిందూసమాజ ఐక్యత, ధర్మరక్షణ, భవిష్యత్ తరాలకు సంస్కృతిపరిరక్షణ లాంటి అంశాలపై ప్రసంగించనున్నారన్నారు. రాష్ట్రీయ స్వయంసేవిక సమితి సంగారెడ్డి కార్యవాహిక మహిళావక్త జగదీశ్వరి మాతాజీ హాజరవుతారన్నారు. గడపలోపలే కులం, గడపదాటితే హిందువులం అనే నినాదాలతో సభను విజయవంతంచేయాలని వినతిచేశారు.



మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట
వార్త

# జనగణన సర్వేలో సాంకేతిక సమస్యలు

**మొగుడంపల్లి, మే 16, ప్రభాతవార్త:**
మండలంలో ఈ నెల 11వ తారీఖు నుంచి ప్రారంభమైన జనగణన సర్వేలో ఎన్యూమరేటర్లు పలుసమస్యలను ఎదుర్కొంటున్నారు. మ్యాపింగ్ సమస్యలు, సర్వర్ పనిచేయకపోవడం, సింక్ ఆలస్యం, ఓటీపీలు రాకపోవడం లాంటి సాంకేతిక సమస్యలు అధికారుల పనులను ప్రభావితం చేస్తున్నాయి. ఎన్యూమరేటర్లు యూజర్ ఐడిలు జనరేట్ కాకపోవడంతో సర్వేప్రక్రియ నెమ్మదిగా సాగుతోంది. గ్రామాల్లో కొన్ని ఇళ్లకు తాళాలు వేసి ఉండటంతో సీరియల్ నంబర్ల మిస్‌మ్యాచ్ సమస్యలు సైతం ఎదురవుతున్నాయి. సర్వేను సమయానికి పూర్తి చేయలేకపోతుండంటంతో సిబ్బంది ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

# కేంద్రమంత్రిని కలిసిన బిజెపి ఓబిసి రాష్ట్ర ఉపాధ్యక్షుడు

**-ఏడుపాయలలో భక్తుల వసతులు కోసం నిధులు మంజూరు చేయాలని వినతి**



కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న పాపగారి రమేష్‌గౌడ్ తదితరులు

**నర్సాపూర్, మే 16, ప్రభాతవార్త:**
కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రివర్యులు కిషన్‌రెడ్డిని శనివారం హైదరాబాదులోని ఆయన కార్యాలయంలో బిజెపి ఓబిసి రాష్ట్ర ఉపాధ్యక్షులు పాపగారి రమేష్‌గౌడ్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పాపగారి రమేష్‌గౌడ్ మెదక్ జిల్లాలోని ఏడుపాయల వనదుర్గామాత ఆలయం వద్ద భక్తులకు సరైన వసతులు లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ మేరకు ఈ ఏడుపాయల వనదుర్గామాత ఆలయం వద్ద కాటేజీల నిర్మాణానికి భక్తుల సౌకర్యం కోసం నాలుగు కోట్ల నిధులు కేంద్ర ప్రభుత్వం నుండి చేయాలని కోరుతూ కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి ఒక వినతి పత్రం సమర్పించారు. ఇందుకు స్పందించిన కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ఈ నిధుల మంజూరు కోసం కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు పాపగారి రమేష్‌గౌడ్ తెలిపారు. కార్యక్రమంలో బిజెపి ఓబిసి రాష్ట్ర ఉపాధ్యక్షులు పాపగారి రమేష్‌గౌడ్‌తోపాటు బిజెపి జిల్లా కార్యదర్శి జగ్గంపేట సత్య నారాయణ, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# కోతుల దాడిలో యువకునికి తీవ్ర గాయాలు

**-మెరుగైన చికిత్స కోసం సంగారెడ్డికి తరలింపు**
**-నర్సాపూర్‌లో కోతులతో అనుక్షణం భయం భయం**

**నర్సాపూర్, మే 16, ప్రభాతవార్త:**
నర్సాపూర్ పట్టణంలో రోజురోజుకు కోతుల బెడద అధికమవడంతో పట్టణ ప్రజలు భయంతో వణికిపోతున్నారు. కోతుల దాడి నుండి పట్టణ ప్రజలను రక్షించాలని పలుమార్లు అధికారులకు వినతిచేసినా, పట్టించుకున్నపాపాన పోవడంలేదు. కోతుల దాడుల వల్ల పట్టణ ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఈక్రమంలోనే శనివారం నర్సాపూర్ పట్టణానికి చెందిన గణేష్ అనే యువకుడు తన బిల్డింగ్‌పై కూర్చుని ఉండగా ఈసమయంలోనే కోతులగుంపు దాడిచేయడానికి ప్రయత్నించగా గణేష్ అనే యువకుడు తప్పించుకునే ప్రయత్నంలో బిల్డింగ్‌పై నుండి కిందపడ్డాడు. ఈ సంఘటనలో గణేష్‌కు తీవ్ర గాయాలు అయ్యాయి. వెంటనే కుటుంబసభ్యులు నర్సాపూర్ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించి చికిత్సలు జరిపించారు. అయితే ఇక్కడి డాక్టర్ల సలహా మేరకు మెరుగైన చికిత్సకోసం సంగారెడ్డికి తరలించాలని డాక్టర్ చెప్పినట్టు కుటుంబీకులు తెలిపారు. ఈ మేరకు అతనిని సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రి తరలించి చికిత్స పొందుతున్నారు. గతంలో కూడా నర్సాపూర్ పట్టణంలో కోతుల భయానికి ఒక బాలుడు భవనం నుంచి పడి మృతిచెందిన సంఘటన ఉన్నది. అదేవిధంగా ఎంతోమందిని కోతులు గాయపరిచినట్లు తెలిపారు. మున్సిపాలిటీపరిధిలోని అన్నివార్డులలో కోతులతో ఇలాంటి సంఘటనలు జరుగుతుండడంతో పట్టణప్రజలు ఆందోళన చెందుతున్నారు. మున్సిపల్ అధికారులు స్పందించి కోతుల దాడులను కట్టడిచేసేందుకు చర్యలుతీసుకోవాలని పట్టణప్రజలు కోరుతున్నారు.

# అంబులెన్స్‌లో అస్సాం మహిళ ప్రసవం

**సిర్గాపూర్, మే 16, ప్రభాతవార్త:**
మండల కేంద్రమైన సిర్గాపూర్‌లోని కోళ్ల ఫారంలో పనిచేస్తున్న అస్సాం రాష్ట్రానికి చెందిన వలస కూలీ తారాభాను బేగం అంబెలెన్స్‌లో ఆడబిడ్డకు జన్మనిచ్చింది. శనివారం అర్ధరాత్రి తారాభాను బేగంకు పురిటినొప్పులు రావడంతో 108 వాహనానికి సమాచారం అందించగా 108 వాహనంలో తారాభాను బేగంను ఆసుపత్రికి తరలిస్తున్న క్రమంలో 108 వాహనంలోనే పురిటి నొప్పులు అధికంకావడంతో ఈఎంటి అరుణ్ కుమార్ సమయస్ఫూర్తితో వ్యవహరించి ప్రశాంతంగా కాన్పు చేయించడంలో సఫలీకృతులయ్యారు. తారాభాను బేగం ఆడబిడ్డకు జన్మనిచ్చింది. తల్లీకూతుర్లు ఇద్దరూ ప్రస్తుతం ఆరోగ్యంగా ఉన్నారని సిర్గాపూర్ పిహెచ్‌సి వర్గాలు పేర్కొన్నాయి.




అంబులెన్స్‌లో అస్సాం మహిళ ప్రసవం

# అసంపూర్తి డ్రైనేజీ పనులతో ప్రజలకు ఇబ్బందులు

**కొల్చారం, మే 16, ప్రభాతవార్త:**
కొల్చారం మండల పరిధిలోని తుక్కాపూర్ గ్రామంలో ఇటీవల చేపట్టిన డ్రైనేజీ నిర్మాణ పనులు మధ్యలోనే నిలిచిపోవడంతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దొడ్లే సంగన్న బసప్ప ఇంటి ముందు నుంచి ఆయిలి శేఖర్ ఇంటి వరకు నిర్మించాల్సిన మురికి కాలువ పనులను పూర్తిచేయకుండానే అధికారులు, సంబంధిత కాంట్రాక్టర్లు వదిలేసినట్లు గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. మధ్యలో కొంతమంది రైతుల పట్టా భూములు ఉన్నప్పటికీ సరైన ప్రణాళిక లేకుండా డ్రైనేజీ నీటిని సొంత పట్టా భూముల వైపు మళ్లించడం వల్ల అక్కడి భూములు మురికి నీటితో నిండిపోతున్నాయని తెలిపారు. ముఖ్యంగా ఆ ప్రాంతంలో ఇటీవల కొత్తగా ఇళ్లు నిర్మించుకున్న కుటుంబాలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నాయని, దుర్వాసనతో పాటు దోమల సమస్య కూడా పెరుగుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యను గ్రామసభలో పాలకవర్గం దృష్టికి తీసుకెళ్లినప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని గ్రామస్థులు ఆరోపించారు. గ్రామ సెక్రటరీ, కొంతమంది గ్రామ పెద్దలు, వారికి సంబంధించిన వ్యక్తులు కావాలనే పనులను పూర్తి చేయకుండా నిర్లక్ష్యం చేస్తున్నారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. తక్షణమే సంబంధిత అధికారులు స్పందించి అసంపూర్తిగా ఉన్న డ్రైనేజీ పనులను పూర్తిచేసి ప్రజలకు ఇబ్బందులు తొలగించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

# విరిగిన చెట్లతో రాకపోకలకు ఇబ్బందులు



ఉసిరికెపల్లి వద్ద రోడ్డుపై విరిగి పడిన చెట్టు దృశ్యం

**మనూర్, మే 16, ప్రభాతవార్త:**
రోడ్డుపై చెట్టువిరిగిపడటంతో అటుగా రాకపోకలకు ప్రయాణికులు ఇబ్బంది లకు గురవుతున్న సంఘటన మండల పరిధిలోని రాయిపల్లికి వెళ్లే రోడ్డులోని ఉసిరికపల్లి సమీపంలో చోటు చేసుకుంది. రోడ్డు పక్కన ఉన్న చెట్ల మధ్యన గుర్తు తెలియని వ్యక్తులు నిప్పుపెట్టడంతో కాలుతూ, అటుగా ఉన్న చెట్లకు నిప్పు అంటుకుని రోడ్డుకు అడ్డంగా చెట్లు పడిపోవడంతో గంటల తరబడి రాకపోకాలు ఆగిపోయాయి. ప్రజలు అధికారులకు సమాచారం అందించినా అధికారులనుంచి స్పందన కరువైందని ఆరోపిస్తున్నారు. ఎస్ఐ కోటేశ్వరరావు కు స్థానికులు సమాచారం ఇవ్వడంతో ఎస్ఐ స్పందించి జెసిబి సహాయంతో చెట్టును రోడ్డుపై నుంచి తొలగించడంతో సమస్య సమసిపోయింది. రోడ్డుకు అడ్డంగా ఉన్న చెట్లకొమ్మలను అధికారులు తొలగించేందుకు చర్యలు తీసుకో వాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# ధాన్యం కొనుగోలు కేంద్రం ఆకస్మిక తనిఖీ

**-ఇప్పటికే 1.32 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు**
**-జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్**



అక్కన్నపేట ఐకెపి కొనుగోలు కేంద్రంలో వివరాలు అడిగితెలుసుకుంటున్న కలెక్టర్ ప్రతిమాసింగ్

**రామాయంపేట, మే 16, ప్రభాతవార్త:**
రైతుల ధాన్యాన్ని సమయానికి తూకం వేసి సంబంధిత మిల్లులకు తరలించేలా చర్యలు తీసుకోవాలని మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అధికారులను ఆదేశించారు. శనివారం రామాయంపేట మండలం అక్కన్నపేట గ్రామంలో ఐకెపి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిఎం మార్కెటింగ్ అధికారి, ఆర్డీవో రమాదేవి, డిఎం సివిల్‌సప్లైస్, డిఎస్ఓ, తహసీల్దార్ రజని, ఎంపిడివో షాజీలొద్దిన్‌తో కలిసి కలెక్టర్ ఆకస్మికంగా పరిశీలించారు. కేంద్రంలో టోకెన్ విధానం అమలును, గోనెసంచులలభ్యతను పరిశీలించిన కలెక్టర్, నియమనిబంధనలు పక్కాగా పాటించాలని సూచించారు. ధాన్యం తేమశాతాన్ని తప్పనిసరిగా పరీక్షించాలని, టోకెన్ విధానాన్ని కచ్చితంగా అమలు చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటి వరకు 1,32,992 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలుచేశామని, ఇంకా 50,000 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే ఉందని తెలిపారు. జిల్లావ్యాప్తంగా ఉన్న 533 కేంద్రాల్లో 519 కేంద్రాల్లో కొనుగోళ్లు జరుగుతున్నాయని చెప్పారు. ఎండలతీవ్రతదృష్ట్యా రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని, రైతులు ఎక్కువసేపు వేచి ఉండే పరిస్థితులు రాకుండా కాంటాలు వేగంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. రవాణాలో జాప్యంలేకుండా చూసి, రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సజావుగా కొనుగోళ్లు జరిపించాలని స్పష్టంచేశారు. ఈ కార్యక్రమంలో మెదక్ ఆర్డీవో రమాదేవి, తహసీల్దార్ రజని, ఎంపిడివో షాజీలొద్దిన్, మార్కెటింగ్, సివిల్‌సప్లైస్ అధికారులు, కొనుగోలుకేంద్ర నిర్వాహకులు పాల్గొన్నారు.

**హౌస్ లిస్టింగ్ పరిశీలన...**
జనగణన-2027లో భాగంగా సమగ్ర, కచ్చితమైన గణాంకాల రూపకల్పనకు జనగణన ప్రక్రియ కీలకమని, ప్రజలందరూ ఇందులో భాగస్వాములు కావాలని కలెక్టర్ ప్రతిమాసింగ్ పిలుపునిచ్చారు. శనివారం రామాయంపేట మండలం అక్కన్నపేట గ్రామంలో ఇళ్ల లెక్కింపు కార్యక్రమాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీచేశారు. ఆర్డీవో రమాదేవి, తహసీల్దార్ రజినికుమారి, ఎంపిడివో షాజీలొద్దిన్, సర్పంచ్ యాదగిరితో కలిసి క్షేత్రస్థాయిలో పర్యటించి హౌస్ లిస్టింగ్ ప్రక్రియను స్వయంగా పర్యవేక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జనాభాగణన, గృహజాబితా కార్యక్రమానికి ప్రజలు పూర్తిసహకారం అందించాలనికోరారు. ఎన్యూమరేటర్లు అడిగే ప్రశ్నలకు కచ్చితమైన వివరాలు అందించాలని సూచించారు. ప్రజలనుండి సేకరించిన సమాచారం అంతా గోప్యంగా ఉంటుందని, ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు. జనగణన కోసం అనుభవజ్ఞులైన సిబ్బందిని సూపర్‌వైజర్లు, ఎన్యూమరేటర్లుగా నియమించి అవసరమైన శిక్షణ ఇచ్చామని తెలిపారు. ఈనెల 11నుంచి జూన్ 9వరకు జరిగే ఇళ్ల గణన సర్వేను పారదర్శకంగా, నిర్ణీత గడువులోగా పూర్తిచేయాలని ఎన్యూమరేటర్లను కలెక్టర్ ఆదేశించారు. ఈకార్యక్రమంలో మెదక్ ఆర్డీవో రమాదేవి, తహసీల్దార్ రజినికుమారి, ఎంపిడివో షాజీలొద్దిన్, సర్పంచ్ యాదగిరి, ఇతర అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# సన్నవరి సాగుకు రైతులు ముందుకు రావాలి

**-సిద్దిపేట జిల్లా కలెక్టర్ హైమావతి**



మార్కెట్ యార్డులో అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ హైమావతి

**హుస్నాబాద్ రూరల్, మే 16, ప్రభాతవార్త:**
వచ్చే ఖరీఫ్‌సీజన్‌లో సన్నవరిని సాగు చేసేందుకు ప్రతిరైతు ముందుకురావాలని జిల్లా కలెక్టర్ కె. హైమావతి పిలుపునిచ్చారు. శనివారం హుస్నాబాద్ పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఎఎంసి) గోదాంలో జరుగుతున్న ధాన్యం దిగుమతి ప్రక్రియను జిల్లా కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ హుస్నాబాద్ వ్యవసాయ మార్కెట్‌కమిటీలోని 5,000మెట్రిక్‌టన్నుల సామర్థ్యం కలిగిన రెండు గోదాముల్లో హుస్నాబాద్, అక్కన్నపేట మండలాలకుచెందిన రైతుల ధాన్యాన్ని దిగుమతి చేస్తున్నట్లు తెలిపారు. ఒకగోదాం దాదాపు పూర్తిగా నిండిపోయిందని, మరోగోదాంలో ఉన్న గన్నీబ్యాగులను ఇతరగోదాములకు తరలించి అక్కడ కూడా ధాన్యం నిల్వచేసేలా చర్యలుతీసుకోవాలని సూచించారు. అకాలవర్షాల వల్ల రైతులు నష్టపోకుండా ఉండేందుకు ప్రస్తుతం మార్కెట్‌కమిటీ గోదాంలోనే ధాన్యం దిగుమతి చేస్తున్నామని తెలిపారు. ఎఎంసిలో పనిచేస్తున్న హమాలీలు ఇతరప్రాంతాలకు వెళ్లకుండా ఇక్కడే విధులు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని మార్కెట్ కమిటీ చైర్మన్ తిరుపతిరెడ్డిని కలెక్టర్ ఆదేశించారు. అనంతరం రైతులతో మాట్లాడిన కలెక్టర్, వచ్చే ఖరీఫ్‌సీజన్‌లో సన్నవడ్ల సాగునుపెంచాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్డీఓ రామ్మూర్తి, ఎసిపి సదానందం, తహసీల్దార్ లక్ష్మారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


మిల్లులకు నిర్దేశించిన లక్ష్యానికి అనుగుణంగా ధాన్యాన్ని తప్పనిసరిగా దిగుమతి చేసుకోవాలని కలెక్టర్ మిల్లర్ యజమానులను ఆదేశించారు. శనివారం హుస్నాబాద్ మండలంలోని పందిళ్ళ గ్రామంలో ఉన్న షణ్ముఖ ఇండస్ట్రీస్, గౌరీశంకర్ ఆగ్రోఇండస్ట్రీస్, పవనసుత ఇండస్ట్రీస్‌లలో ధాన్యం దిగుమతి ప్రక్రియను కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ధాన్యం కొనుగోలుప్రక్రియ సజావుగా కొనసాగుతోందని తెలిపారు. ప్రతిమిల్లుకు కేటాయించిన లక్ష్యం మేరకు ధాన్యం దిగుమతి జరగాలని స్పష్టం చేశారు. అకాలవర్షాల కారణంగా ధాన్యం తడిసిపోకుండా ఉండేందుకు స్థానికంగా అందుబాటులో ఉన్న ట్రాక్టర్లు, ఇతర వాహనాల ద్వారా వేగంగా మిల్లులకు తరలిస్తున్నామని, ఈవిషయంలో మిల్లర్ యజమానులు పూర్తిసహకారం అందించాలని సూచించారు. ధాన్యందిగుమతిలో జాప్యం జరగకుండా రెవెన్యూ అధికారులను ప్రత్యేకంగా నియమించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీఓ రామ్మూర్తి, ఎసిపి సదానందం, తహసీల్దార్ లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**హుస్నాబాద్-కొత్తపల్లి నాలుగు వరసల రోడ్ పనులను పరిశీలించిన కలెక్టర్...**

**హుస్నాబాద్ టౌన్, మే 16, ప్రభాతవార్త:**
హుస్నాబాద్ నుండి కొత్తపల్లి వరకు రూ.77.20 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న నాలుగు వరసల రహదారి పనులను కలెక్టర్ కె.హైమావతి శనివారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రోడ్‌విస్తరణ పనుల్లో భాగంగా రహదారి వెంబడి చెట్ల కటింగ్, పొదల తొలగింపు ప్రక్రియ దాదాపు పూర్తయ్యిందని అధికారులు కలెక్టర్‌కు వివరించారు. అలాగే విద్యుత్ స్తంభాల మార్పిడి పనులు కూడా వేగంగా కొనసాగుతున్నట్లు తెలిపారు. మున్సిపల్ కమిషనర్, కాంట్రాక్టర్‌ల సంయుక్త పర్యవేక్షణలో మున్సిపల్ ప్రాంతాల్లో పెండింగ్‌లో ఉన్న చెట్ల తొలగింపు, మార్కింగ్ చేసిన నివాసాల తొలగింపు ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ హైమావతి ఆదేశించారు. రోడ్ నిర్మాణ పనులు నాణ్యతాప్రమాణాలు పాటిస్తూ నిర్ణీత కాలవ్యవధిలోపు పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఆర్డీఓ రామ్మూర్తి, తహసీల్దార్ లక్ష్మారెడ్డి, విద్యుత్ శాఖ డిఈ, కాంట్రాక్టర్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యారంగానికి అధిక ప్రాధాన్యం

**-టిజిఐఐసి చైర్‌పర్సన్ నిర్మలాజగ్గారెడ్డి**




సన్మానిస్తున్న నిర్మలాజగ్గారెడ్డి

**సంగారెడ్డి బ్యూరో, మే 16, ప్రభాతవార్త:**
కాంగ్రెస్ ప్రభుత్వం విద్యారంగానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని టిజిఐఐసి చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి అన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా సంగారెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరిగిన విద్యా వారోత్సవాలకు నిర్మలా జగ్గారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కళాశాలలో ఆన్‌లైన్ తరగతుల కోసం నూతనంగా ఏర్పాటు చేసిన మానిటర్‌లను ఆమె లాంఛనంగా ప్రారంభించారు. విద్యార్థులతోకలిసి ముచ్చటించారు. ఈ సందర్భంగా నిర్మలా జగ్గారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ కళాశాల విద్యార్థినులు అన్ని రంగాల్లో ముందుండాలని అన్నారు. భవిష్యత్తుపై స్పష్టమైన దృష్టితో ఇప్పటినుండే కష్టపడాలని సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కూన సంతోష్, ప్రిన్సిపాల్ సునీత, లెక్చరర్ శ్రీనివాస్, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

# మండలంలో రెచ్చిపోతున్న దోపిడీ దొంగలు

**-మహిళలపై దాడులు చేసి బంగారు ఆభరణాలు చోరీ చేసిన వైనం**

**బెజ్జంకి, మే 16, ప్రభాతవార్త:**
మండల పరిధిలోని చీలాపూర్, రేగులపల్లి గ్రామాల్లో శుక్రవారం అర్ధరాత్రి సమయంలో గుర్తు తెలియని దుండగులు మహిళలపై దాడులకు పాల్పడి బంగారు పుస్తెలతాళ్లు లాక్కెళ్లిన సంఘటనలు స్థానికంగా కలకలం రేపుతున్నాయి. చీలాపూర్ గ్రామానికి చెందిన కొత్త తారవ్వ తన ఇంటి వద్ద కుటుంబ సభ్యులతో కలిసి నిద్రిస్తున్న సమయంలో ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు ఆమె మెడలోంచి బంగారు తాడును లాక్కోవడానికి ప్రయత్నించారు. ఆమె గట్టిగా కేకలు వేయడంతో కుటుంబ సభ్యులు మేల్కొనగా, దొంగలు అక్కడి నుంచి పరారయ్యారు. అదే గ్రామానికి చెందిన తడిమేలపల్లి లక్ష్మీ (విశాని మణెమ్మ) ఇంటి ముందు నిద్రిస్తున్న సమయంలో గుర్తు తెలియని వ్యక్తి ఆమె మెడలో ఉన్న మూడున్నరతులాల బంగారు పుస్తెలతాడును లాక్కొని పారిపోయాడు. ఈ సంఘటనలో బాధితురాలికి స్వల్పంగా గాయాలయ్యాయి. రేగులపల్లి గ్రామానికి చెందిన భూపతి లాస్య ఇంటి బయట నిద్రిస్తున్న సమయంలో అదే తరహాలో దొంగలు మూడు తులాల బంగారు పుస్తెలతాడును లాక్కొని పరారయ్యారు. కుటుంబసభ్యులు, స్థానికులు వెతికినప్పటికీ, దొంగల ఆచూకీ లభించలేదు. ఈరకమైన వరస సంఘటనలపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఘటనాస్థలాలను పరిశీలిస్తూ సిసి టివి ఫుటేజ్, సాంకేతిక ఆధారాల సహాయంతో దొంగల కదలికలను గుర్తించే పనిలో ఉన్నారు. దొంగలను పట్టుకోవడానికి ప్రత్యేక బృందాలను రంగంలోకి దింపారు. రాత్రి సమయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఇళ్ల పరిసరాల్లో సరిపడా లైటింగ్, సిసి టివి కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఎక్కడ అనుమానాస్పద వ్యక్తులు కనిపించినా సరే, వెంటనే డయల్ 100కు సమాచారం అందించాలని ఎస్ఐ తోట తిరుపతి ఈ సందర్భంగా తెలిపారు.

# పోలీసులకు సవాలుగా మారిన భారీ చోరీ..!!

**ప్రత్యేక బృందాలతో గాలింపు ముమ్మరం**



చోరీ జరిగిన ఇంటికి పరిశీలిస్తున్న జిల్లా ఎస్పీ (ఫైల్ ఫోటో)

**పెద్దశంకరంపేట, మే 16, ప్రభాతవార్త:**
మండల పరిధిలోని చీలపల్లి గ్రామంలో గురువారం అర్ధరాత్రి జరిగిన భారీ చోరీ పోలీసులకు సవాలుగా మారింది. ఈ భారీ చోరీని సవాలుగా తీసుకున్న పోలీసులు తమ దర్యాప్తును ముమ్మరం చేశారు. జిల్లాలో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తున్న దొంగలు రెచ్చిపోయారు. జాతీయ రహదారికి కూతవేటు దూరంలో ఉన్న మండల పరిధిలోని చీలపల్లి గ్రామాన్ని టార్గెట్‌గా చేసుకున్న దొంగలు అర్ధరాత్రి చేసిన భారీ చోరీ స్థానికంగా తీవ్రంగా కలకలం రేపింది. తాళం వేసి ఉన్న ఇళ్లను టార్గెట్‌గా చేసుకొని దొంగలు భీభత్సం సృష్టించారు. ఐదు ఇళ్లలో తాళాలు పగులగొట్టి దొంగతనానికి పాల్పడ్డారు. ఈ చోరీల్లో రాయిని రాములుకు చెందిన ఇంట్లోనే 110 తులాల బంగారం రెండున్నర కెజిల వెండిని దొంగలు ఎత్తుకెళ్లారు. మరో బాధితుడు ఏసిరెడ్డి మాణిక్ రెడ్డికి చెందిన ఇంట్లో కూడా దొంగలు మూడు తులాల బంగారు నగలను కూడా అపహరించారు. ఈరెండు ఇళ్లలో దొంగిలించిన సొమ్ము విలువ సుమారు రెండు కోట్ల వరకు ఉంటుందని అంచనా. ఈ ఘటన వెనుక అంతర్రాష్ట్ర దొంగల ముఠా ఉన్నట్లుగా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ భారీ చోరీ జిల్లా వ్యాప్తంగా సంచలనం సృష్టించింది. అత్యంత వ్యూహాత్మకంగా సాగిన ఈ చోరీని సవాలుగా తీసుకున్న పోలీసులు ఈ కేసును చేదించడానికి తీవ్రంగా కృషి చేస్తున్నారు. ఉన్నతాధికారులు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి గాలింపు చర్యలను ముమ్మరం చేశారు. మండలంలోని వివిధ ప్రాంతాల్లో, జాతీయ రహదారిపై ఉన్న సిసి టివి ఫుటేజీలను ప్రస్తుతం పోలీసులు జల్లెడపడుతున్నారు. పాత నేరస్థులు, ఇతర రాష్ట్రాలలోని ముఠాల కదలికలపై కూడా పోలీసులు ఆరా తీస్తున్నారు. ఈ సందర్భంగా నిందితులను త్వరలో పట్టుకుంటామని పోలీసులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఏది ఏమైనా ఈ ఘటనతో స్థానిక ప్రజలు తీవ్ర భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు.

## నిమ్స్‌లో వైద్య సంరక్ష వృత్తి నిపుణుల వార్షిక వేడుకలు



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ నగరి బీరప్ప

**జూబ్లీహిల్స్, మే 16, ప్రభాతవార్త:** నిమ్స్‌లో వైద్య సంరక్ష వృత్తి నిపుణుల 34వ వార్షిక వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకలకు నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ నగరి బీరప్ప ముఖ్యఅతిధిగా హాజరై మాట్లాడుతూ నిమ్స్ అభివృద్ధిలో సమిష్టి కృషి ఉందన్నారు. వైద్యవిద్యా రంగంలో దేశంలో నిమ్స్ ప్రముక స్థానంలో ఉందన్నారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తున్నానని, చిన్నిచిన్న సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తామన్నారు. యూనియన్ అధ్యక్షురాలు శాంతకుమారి మాట్లాడుతూ నిమ్స్ పారామెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో సమస్యల పరిష్కారానికి ఎప్పుడు ముందుంటామన్నారు. యూనియన్ ప్రధాన కార్యదర్శి కే. మహేష్ బాబు మాట్లాడుతూ ఉద్యోగుల గ్రాట్యుటీ పెంపు చాలా కాలంగా పెండింగ్‌లో ఉందని, ఉద్యోగులు ఏ క్యాడర్లో జాయిన్ అయ్యారో అదే కేడర్‌లో రిటైర్ అవుతున్నారని, మూడు దశాబ్దాలుగా సేవలు చేసినా ఒక్క పదోన్నతి లేదని అన్నారు. ఈ అంశాలపై సమీక్షించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. గతంలో ఇచ్చిన పీజీ ఇంక్రిమెంట్ యధావిధిగా కొనసాగించాలని, ఉద్యోగ నియామకాలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో ఉద్యోగులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఉద్యోగులను అలరించాయి.

## కేశవరావు కమిటీని రద్దు చేయాలి : ఉద్యమకారుల జెఏసి



అభివాదం తెలుపుతున్న జెఏసి నాయకులు

**సైఫాబాద్, మే 16 ప్రభాతవార్త:** తెలంగాణ ఉద్యమకారుల కోసం రాష్ట్ర ప్రభుత్వం వేసిన కె.కేశవరావు కమిటిని తెలంగాణ ఉద్యమకారుల జెఏసి తీవ్రంగా వ్యతిరేకించింది. ఈ కమిటీలో తెలంగాణ ఉద్యమకారులు లేరని, అంతా ప్రభుత్వ రంగానికి చెందిన వారేనని జెఏసి ఛైర్మన్ సుల్తాన్ యాదగిరి ఆరోపించారు. శనివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ కమిటీలో ఉద్యమకారుల సంఘాల నుంచి సభ్యులుగా ఎవరిని నియమించలేదన్నారు. ఉద్యమకారుల సంఘాల నుంచి మరో 5 గురు సభ్యులను నియమించాలని, నిర్ణిత కాలంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో మరో ఉద్యమానికి శ్రీకారం చుడతామని ఆయన హెచ్చరించారు. ఉద్యమకారులకు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ ప్రకారం 250 గజాల ఇంటి స్థలం, 25 వేలు పెన్షన్ సౌకర్యం, గుర్తింపు కార్డులు పంపిణి చేయాలని ఆయన డిమాండ్ చేశారు.


## మహిళా రిజర్వేషన్ల అమలుపై సంతకాల సేకరణ



సంతకాలు చేసిన పోస్టు కార్డులను చూపుతున్న విజయారెడ్డి ఇతర కాంగ్రెస్ మహిళా నేతలు

**జూబ్లీహిల్స్, మే 16, ప్రభాతవార్త:** మహిళా రిజర్వేషన్ బిల్లు 33 శాతంను వెంటనే అమలు చేయాలని ఖైరతాబాద్ డివిజన్ మాజీ కార్పొరేటర్, టిపిసిసి కార్యదర్శి పి విజయారెడ్డి డిమాండ్ చేశారు. ఎర్రమంజిల్ డివిజన్ అధ్యక్షురాలు ఎల్లమ్మ ఆధ్వర్యంలో మహిళా రిజర్వేషన్ బిల్లు అమలుపై శనివారం పోస్టుకార్డుల సంతకాల సేకరణ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న విజయారెడ్డి మాట్లాడుతూ మహిళా ఆరక్షన్ బిల్ ఆజ్ కరో, అబికరో అనే నినాదంతో పోస్టు కార్డులపై సంతకాలు చేయించి వాటిని ప్రధాని కార్యాలయానికి పోస్ట్ చేస్తామన్నారు. ఖైరతాబాద్ జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు శంబుల ఉషశ్రీ శ్రీకాంత్‌గౌడ్, ఆలిండియా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు అల్కాలాంబ, రాష్ట్ర అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ సూచన మేరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి లావణ్య, మహిళా నాయకులు కమల, శ్రీదేవి, ఎల్లమ్మ, మాధురి, సంధ్యారాణి, మాధవి, భవాని, అనురాధ, పార్వతమ్మ పాల్గొన్నారు.

## విజయ్ డెయిరీ మార్కెటింగ్ బృందంతో సమావేశం



సిబ్బందితో చైర్మన్ గుత్తా అమిత్ రెడ్డి

**తార్నాక, మే 16 ప్రభాతవార్త :** లాలాపేటలోని తెలంగాణ విజయ డైరీ కార్యాలయంలో మార్కెటింగ్ బృందంతో సమీక్ష సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ఈ సమావేశానికి విజయ డైరీ చైర్మన్ గుత్తా అమిత్ రెడ్డి హాజరై మార్కెటింగ్ కార్యకలాపాలపై సమీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా మరిన్ని విజయ పార్లర్లు, విజయ బూత్‌లను ఏర్పాటు చేసి ప్రజలకు మరింత చేరువ కావాలని సూచించారు. ప్రజలకు నాణ్యమైన పాల ఉత్పత్తులను అందించడంలో విజయ డైరీ కీలక పాత్ర పోషించాలని పేర్కొన్నారు. అలాగే విజయ డైరీ ఉత్పత్తులను రాష్ట్ర ప్రజలకు మరింత విస్తృతంగా అందుబాటులోకి తీసుకురావడానికి మార్కెటింగ్ బృందం ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగాలని కోరారు. నాణ్యత, విశ్వసనీయతతో పాటు వినియోగదారుల అవసరాలకు అనుగుణంగా సేవలు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో విజయ డైరీ మార్కెటింగ్ డిప్యూటీ డైరెక్టర్ మోహన్ మురళి, డీజీఎం ప్రవీణ్ కుమార్ సిబ్బంది పాల్గొన్నారు.

## దేశానికి హిందూ ధర్మం ఆత్మలాంటిది



కార్యక్రమంలో ప్రసంగిస్తున్న సునీత రామ్‌మోహన్‌రెడ్డి

**కంటోన్మెంట్, మే 16 ప్రభాతవార్త:** వెస్ట్ మారేడ్‌పల్లిలోని సాయిబాబా దేవాలయం ప్రాంగణంలో వెస్ట్‌మారేడ్‌పల్లి మండలం హిందూ సమ్మేళన సమితి ఆధ్వర్యంలో శనివారం హిందూ సమ్మేళనం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న తెలంగాణ ప్రాంత సమాజిక సమరసత మహిళా కన్వీనర్ సునీత రామ్‌మోహన్‌రెడ్డి మాట్లాడుతూ దేశానికి హిందూ ధర్మం ఆత్మంటిదని, సమాజాన్ని చైతన్యవంతం చేసి దేశాన్ని తిరిగి విశ్వగురువుగా నిలపాలనే లక్ష్యంతో ప్రతీ వ్యక్తి కృషి చేయాలని అన్నారు. ప్రతి ఒక్కరిలో హిందూ సమాజం పట్ల గౌరవం, ఏకాత్మతా భావం పెంపొందించాలన్నారు. ఈ కార్యక్రమంలో సాయిబాబా దేవాలయం అర్చకుడు వెంకట రమణాచార్యులు, సంభాగ్ ప్రచార ప్రముఖ్ నవీన్, మాజీ కార్పొరేటర్ కొంతం దీపికలు పాల్గొన్నారు.

## విద్యార్థులకు విద్యతో పాటు కళలు కూడా అవసరం

**బేగంపేట మే 16, ప్రభాతవార్త**

విద్యార్థులకు విద్యతో పాటు కళలు కూడా ఎంతో అవసరం అని బేగంపేట ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ అప్పియా చిన్నమ్మ అన్నారు. విద్యావారోత్సవాలలో భాగంగా బేగంపేట ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల సాంస్కృతిక విభాగం శనివారం కల్చరల్ అండ్ ఇన్నోవేషన్ డేని ఘనంగా నిర్వహించింది. మానవ మనుగడుకు విద్యతో పాటు కళలు కూడా ఎంతో అవసరం అని ప్రిన్సిపాల్ అన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా విచ్చేసిన హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం అర్థశాస్త్ర విభాగం ప్రొఫెసర్ నాగేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థులు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని ఆకాంక్షిస్తూ పాటతో అలరించారు. విద్యార్థులు, పాటలు, నృత్యాలు, కవితలు, కథలు, తదితర అంశాలలో నైపుణ్యాన్ని ప్రదర్శించారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ప్రిన్సిపాల్ అప్పియా చిన్నమ్మ, వైస్ ప్రిన్సిపాల్ టి.భాస్కరరెడ్డిల చేతుల మీదుగా రూ 1000ల నగదు బహుమతిని అందించారు. సంప్రదాయ నృత్యంలో ఎన్. భార్గవి, జి.వైష్ణవి, ఏ.దివ్యలు ప్రదర్శించిన మహాభారత ఘట్టం ఆహుతులను ఎంతగానో ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు ప్రొఫెసర్ అప్పర్ ఉన్నిసా, డా.నాన్సీ సరేనా, డా.విజయ రాఘవి, డా.కాజాబీ, డా. శాంతికళ, డా.ప్రణీతలు పాటలను ఆలపించారు. బిజే గౌతమ్ మృదంగ విన్యాసం అలరించింది. పాల్గొన్న విద్యార్థులకు సాంస్కృతిక విభాగం మెమెంటోలు అందజేసిం



విద్యార్థినులను అభినందిస్తున్న కళాశాల ప్రిన్సిపాల్ అప్పియా చిన్నమ్మ.

ది. మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల కేంద్రంలో నిర్వహించిన విద్యావారోత్సవాల్లో మెరిసిన బేగంపేట డిగ్రీ కళాశాల విద్యార్థులు. రాష్ట్ర ప్రభుత్వం విద్యావారోత్సవాల్లో భాగంగా మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల కేంద్రంలో ఘనంగా నిర్వహించిన కార్యక్రమంలో బేగంపేట ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థునులు ప్రతిభ చూపారు. ప్రతిభ కనబర్చిన ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినులను విద్యాశాఖ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి యోగితా రాణా సత్కరించారు. సంప్రదాయ నృత్య విభాగం నుంచి బి.శ్రీవల్లి, సంప్రదాయ గాన విభాగం నుంచి అరభి అయ్యర్ ప్రశంసా పత్రాలు, ఒక్కొక్కరూ మూడువేల రూపాయల నగదు బహుమతిని అందుకున్నారు. ప్రభుత్వ గుర్తింపు లభించడం తమకెంతో ఆనందం కల్గించిందని ప్రిన్సిపాల్ అప్పియా చిన్నమ్మ, అధ్యాపకులు అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు రాష్ట్ర ప్రభుత్వానికి, ఉన్నత విద్యాశాఖ కమీషనర్ దేవసేన కి కృతజ్ఞతలు తెలియజేసారు.

## ఉద్యమకారుల గౌరవానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉంది : మోతే శోభన్ రెడ్డి

**-ఉద్యమకారుల గుర్తింపు కమిటీ ఏర్పాటు చారిత్రాత్మక నిర్ణయం**

**తార్నాక, మే 16 ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ సాధనలో కీలక పాత్ర పోషించిన తొలి దశ, మలిదశ ఉద్యమకారుల సేవలు, త్యాగాలకు తగిన గౌరవం కల్పించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం చారిత్రాత్మకమని తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు కమిటీ సభ్యుడు మోతే శోభన్ రెడ్డి పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమం, గుర్తింపు, గౌరవ పరిరక్షణ కోసం ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేయడం ఉద్యమకారుల ఆత్మగౌరవాన్ని నిలబెట్టే చర్యగా ఆయన అభినందించారు. శనివారం తార్నాక డివిజన్‌లోని తన నివాసంలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించి వారి నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మోతే శోభన్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం వేలాది మంది ఉద్యమకారులు చేసిన త్యాగాలు, పోరాటాలను



అధికారికంగా గుర్తించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ముందడుగు వేయడం ఉద్యమకారులకు దక్కిన గొప్ప గౌరవమన్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలో అనేక మంది యువకులు ప్రాణత్యాగాలు చేయగా, మరికొందరు పోలీసు కేసులు, జైలు జీవితం, శారీరక-మానసిక ఇబ్బందులను ఎదుర్కొన్నారని గుర్తుచేశారు. ఉద్యమకారులకు గుర్తింపు కల్పించాలనే డిమాండ్ ఎన్నో ఏళ్లుగా కొనసాగుతుండగా, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకుని ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయడం హర్షణీయమన్నారు.

## తెలంగాణ ఉద్యమకారుల డిమాండ్లను అమలు చేయాలి

**సైఫాబాద్, మే 16 ప్రభాతవార్త:** తెలంగాణ ఉద్యమకారులకు న్యాయం చేసే దిశగా రాష్ట్ర ప్రభుత్వం కె.కేశవరావు ఆధ్వర్యంలో కమిటీని వేయడాన్ని తెలంగాణ ఉద్యమకారుల వేదిక ఆహ్వానించింది. త్వరలో సిఎం రేవంత్‌రెడ్డి, కె.కెశవరావును కలుస్తామని, ఉద్యమకారుల డిమాండ్లను అమలు చేయాలని కోరుతామని వేదిక తెలిపింది. శనివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో ఉద్యమకారుల రాష్ట్ర స్థాయి సదస్సు జరిగింది. ఈ సదస్సులో వేదిక రాష్ట్ర ఛైర్మన్ నరాల సత్యనారాయణ మాట్లాడుతూ జూన్ 2వ తేదీలోగా ఉద్యమకారుల డిమాండ్లను అమలు చేయాలని కోరుతామని, నెలరోజుల్లోగా అమలు చేయకపోతే 'చలో అసెంబ్లీ ముట్టడి' కార్యక్రమాన్ని చేపట్టి ప్రాణాలను అర్పిస్తామన్నారు. ఉద్యమకారులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని, ఇంటి స్థలం 250 గజాలతోపాటు నాలుగు గదుల ఇల్లు నిర్మించాలని, ప్రతి నెల 25 వేల రూపాయల పెన్షన్ సౌకర్యం కల్పించాలని, పది లక్షల బీమా సౌకర్యం, కుటుంబ సభ్యులకు ఆరోగ్యశ్రీ ద్వారా 25 లక్షల వరకు వర్తింప జేయాలని, బస్‌లు, రైలులో



సదస్సులో పాల్గొన్న తెలంగాణ ఉద్యమకారులు

ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాలని, పిల్లలకు ఫీజుల రీయంబర్స్‌మెంట్ ద్వారా ఉచితంగా విద్యను అందిచాలని, అలాగే విద్యను అభ్యసించిన తరువాత ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని, 10 వేల కోట్లతో సంక్షేమ నిధిని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కెకె కమిటీలో నిజమైన ఉద్యమకారులను గుర్తించాలని, ఎఫ్ఐఆర్ కేసులు అయినవారు, బైండోవర్ కేసులైనవారు, 2001 నుంచి 2014 వరకుక సీనియర ఉద్యమకారులను, 1969 ఉద్యమకారులను గుర్తించి న్యాయం చేయాలని, అలాగే అమరుల కుటుంబాలను అదుకోవాలని కోరారు. ఈ సదస్సులో నాయకులు తోడేటి శంకర్‌గౌడ్ పాల్గొన్నారు.

## ఆశాభోస్లే లతామంగేష్కర్‌లు విశ్వవిఖ్యాత గాయనీమణులు : రామచందర్‌రావు

**రవీంద్రభారతి, మే 16 ప్రభాతవార్త :** భారతదేశంలో ఆశాభోస్లే, లతామంగేష్కర్ ఇద్దరూ విశ్వవిఖ్యాత గాయనీమణులని, వారి పాటలు ఎంతో వినసొంపుగా ఉంటాయని, అయితే ఇప్పటి గాయకుల్లో ఎస్.పి.శైలజ అద్భుతమైన పాటలను వీనులవిందుగా సుమధురంగా ఆలపిస్తూ ఆలోను తీరుస్తున్నారని తెలంగాణ రాష్ట్ర బిజెపి అధ్యక్షుడు ఎన్.రామచందర్‌రావు అన్నారు. నేడు సంగీతంలో కూడా ఎన్నో మార్పులొచ్చినా మన మూలాలను మాత్రం మరచిపోరాదని, భాకతీయ సంస్కృతి, సంగీత సాహిత్యాలు కళలు కాపాడుకుంటూ ప్రోత్సహించాలని హితవుపలికారు. విదేశాల్లో మన భారతీయ సంతతే కాకుండా అక్కడి కళాకారులు కూడా మన సంస్కృతి కళలు సంగీతంపట్ల ఎంతో మక్కువ చూపిస్తూ అభ్యసించి ఆనందిస్తున్నారని గుర్తుచేశారు. తెలంగాణ పర్యాటక, భాషా సాంస్కృతికశాఖల సౌజన్యంతో ఆనందభైరవి సంస్థ ఆధ్వర్యంలో రవీంద్రభారతి ప్రధాన మందిరంలో అంతర్జాతీయ గాయని శారదాసాయి నిర్వహణలో సంస్థ 14వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఆశాభోస్లేకు సినీ సంగీత విభావరితో ఘననివాళులర్పిస్తున్న కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎన్.రామచందర్‌రావు ఆత్మీయ



ఎస్పీ శైలజను పురస్కారంగా సత్కరిస్తున్న ఎన్.రామచందర్‌రావు, శారదాసాయి, చంద్రశేఖర్, అశోక్, వెంకట్రావు తదితర అతిథులు

అతిథులు నంగునూరి చంద్రశేఖర్, బి.అశోక్, యుగంధర్, చక్రపాణి, డా. బంటి. వెంకటేశ్వరరావు, వడ్లకొండ వెంకట్రావు తదితరులతో ప్రముఖ నేపథ్యగాయని ఎస్.పి.శైలజను ఘనంగా సత్కరించి ఆనందభైరవి-ఆశాభోస్లే ఎక్సలెన్సీ అవార్డు ప్రదానం చేసి ఎంతగానో అభినందించారు. సభకుముందు సినీసంగీత విభావరిలో గాయని ఎస్.పి.శైలజ పలువురు వర్ధమాన గాయకులతో కలిసి ఆలపించి ఆణిముత్యాల్లాంటి సినీగీతాలు విచ్చేసి అశేష సంగీతప్రియులు, ఔత్సాహిక ప్రేక్షకులను సంగీతలోకంలో విహరింపజేశాయి.

## నకిలీ వైద్యుడి అరెస్ట్



నిందితుడి వివరాలు తెలుపుతున్న పోలీసులు

**సికింద్రాబాద్, మే 16 ప్రభాతవార్త:**

ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతూ, ఎలాంటి అర్హత లేకుండా అక్రమంగా ఇంజక్షన్లు ఇస్తున్న ఒక నకిలీ వైద్యుడిని వారాసిగూడ పోలీసులు అరెస్ట్ చేశారు. వారాసిగూడలో మాధవ మెడికల్ షాప్ పేరుతో సాగుతున్న ఈ అక్రమ ధందాను పోలీసులు చేదించారు. భూపాలపల్లికి చెందిన నన్నుట మాధవ్ (42) కొంతకాలంగా వారాసిగూడలో ఉంటున్నాడు. ఇంటర్మీడియట్ ఫెయిల్ అయిన నిందితుడికి ఎలాంటి వైద్య లేదా ఫార్మసీ అర్హతలు లేవు. ఎక్కువ డబ్బు సంపాదించాలనే దురాశతో, కుంట అర్చన అనే స్నేహితురాలి డ్రగ్ లైసెన్స్‌ను అడ్డం పెట్టుకుని ప్రాక్టీస్ చేస్తున్నాడు. సమాచారం అందుకున్న వారాసిగూడ పోలీసులు డెకాయ్ ఆపరేషన్ నిర్వహించి, ముఫ్తీలో ఉన్న హెడ్ కానిస్టేబుల్‌కు ఇంజక్షన్ ఇవ్వబోతుండగా నిందితుడిని రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. తాను గత ఏడాది కాలంగా రోగులకు వైద్యం చేస్తూ, డాక్టర్ ప్రిస్క్రిప్షన్ లేకుండా డైక్లోఫినాక్, టీటీ వంటి ఇంజక్షన్లు ఇస్తున్నట్లు నిందితుడు అంగీకరించాడు. సబ్ ఇన్‌స్పెక్టర్ ఆ షాప్‌లో అక్రమంగా ఉంచిన ఇంజక్షన్ వైల్స్‌ను, వ్యాపారానికి ఉపయోగించే శామ్‌సంగ్ మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### మణికొండ డాలర్ హిల్స్‌లో తెగిపడ్డ లిఫ్ట్

## ఆరుగురు బిఆర్ఎస్ నాయకులకు గాయాలు

**హైదరాబాద్, మే 16 ప్రభాతవార్త**

మణికొండలోని డాలర్ హిల్స్‌లో శనివారం లిఫ్ట్ ప్రమాదం చోటుచేసుకుంది. ఒక అపార్ట్మెంట్లో లిఫ్ట్ వైర్లు ఒక్కసారిగా తెగిపోవడంతో అందులో ప్రయాణిస్తున్న ఆరుగురు బీఆర్ఎస్ నాయకులు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన స్థానికంగా కలకలం సృష్టించడమే కాకుండా అపార్ట్మెంట్లోని నివాసితులను భయాందోళనకు గురిచేసింది. డాలర్ హిల్స్లోని ఒక అపార్ట్మెంట్ ఐదవ అంతస్తులో రాజేంద్ర నగర్ నియోజకవర్గం ఇంచార్జ్ కార్తీక్ రెడ్డి చేయబోయే పాదయాత్ర కు సన్నాహక సమావేశం జరిగింది. ఈ మీటింగ్ ముగించుకుని ఆరుగురు నాయకులు గ్రౌండ్ ఫ్లోర్కు వెళ్లేందుకు లిఫ్ట్ ఎక్కారు. లిఫ్ట్ కిందకు దిగుతున్న సమయంలో ఒక్కసారిగా సాంకేతిక లోపం తలెత్తి, వైర్లు తెగిపోయాయి. దీంతో లిఫ్ట్ నేరుగా ఐదో అంతస్తు నుండి కిందకు కుప్పకూలిపోయింది. లోపల ఉన్న వారు ఏం జరుగుతుందో తెలుసుకునే లోపే ప్రమాదం జరిగిపోయింది. ఈ ప్రమాదంలో లిఫ్టో ఉన్న ఆరుగురు నాయకులకు గాయాలు కాగా, ఇద్దరి పరిస్థితి అత్యంత తీవ్రంగా ఉన్నట్లు సమాచారం. లిఫ్ట్ వేగంగా కిందకు పడటంతో ప్రభావం ఎక్కువగా ఉండి ఇద్దరి కాళ్లు విరిగినట్లు తెలుస్తోంది. ప్రమాదం జరిగిన వెంటనే అపార్ట్మెంట్ వాసులు, ఇతర నాయకులు స్పందించి క్షతగాత్రులను బయటకు తీశారు. తీవ్రంగా గాయపడ్డ ఇద్దరిని అత్యవసర చికిత్స నిమిత్తం జూబ్లీహిల్స్లోని అపోలో ఆసుపత్రికి తరలించారు.

## సంప్రదాయ మామిడి కాయ పచ్చడి తయారీ వర్క్‌షాప్

**బేగంపేట మే 16, ప్రభాతవార్త**

వినూత్న వంటకాల ఆధారిత పర్యాట కార్యక్రమాలు తెలంగాణా సంప్రదాయ ఆహార సంస్కృతిని పరిరక్షిస్తాయని తెలంగాణా టూరిజం అధికారులు అన్నారు. ముఖ్యంగా యువత, పర్యాటకులకు సాంస్కృతిక అనుభూతిని అందిస్తాయని తెలిపారు. బేగంపేట లో తెలంగాణా టూరిజం ఆధ్వర్యంలో సంప్రదాయ మామిడి కాయ పచ్చడి తయారీ వర్క్‌షాప్ ను నిర్వహించారు. తెలంగాణా టూరిజం డెవలప్‌మెంట్ కార్పోరేషన్ (టీజీటీడీసీ), తెలంగాణా ఛెఫ్స్ అసోసియేషన్ సహకారంతో ది ప్లాజా వేదికగా మామిడి కాయ పచ్చడి తయారీ వర్క్‌షాప్‌ను విజయ వంతంగా నిర్వహించింది. తెలంగాణా సంప్రదాయ వంటకాల వారసత్వాన్ని ప్రతిబింబించిన ఈ కార్యక్రమానికి గృహిణులు, ఆహార ప్రియులు, పర్యాటకులు, పాల్గొనే వారి నుంచి విశేష స్పందన లభించింది. ఈ కార్యక్రమం టీజీటీడీసీ ఛైర్మన్ పాటిల్ రమేష్ రెడ్డి, యూత్ అడ్వాన్స్‌మెంట్, టూరిజం అండ్ కల్చర్ విభాగం ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వాణీ ప్రసాద్, టీజీటీడీసీ మేనేజింగ్ డైరెక్టర్ గౌతమి, పర్యాటక శాఖ డైరెక్టర్ రంజీత్ నాయక్, సహకారంతో నిర్వహించారు. తెలంగాణా సంప్రదాయ వంటకాల సంస్కృతిని పునరుద్ధరించి, ప్రోత్సహించేందుకు తెలంగాణా టూరిజం తీసుకున్న ఈ ప్రత్యేక కార్యక్రమాన్ని ప్రముఖులు అభినందించారు. ముందుగా అతిధులు, ఛెఫ్స్, పర్యాటక శాఖ అధికారులు సమక్షంలో దీప



సంప్రదాయ మామిడి కాయ పచ్చడి వర్క్‌షాప్‌ను ప్రారంభిస్తున్న టీజీటీడీసీ ఛైర్మన్ పాటిల్ రమేష్‌రెడ్డి. అధికారులు. ఛెఫ్ సంజయ్ తుమ్మా.

ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రముఖ సెలబ్రిటీ ఛెఫ్ సంజచ్ తుమ్మా సంప్రదాయ తెలంగాణా శైలిలో మామిడి కాయ పచ్చడి తయారీ విధానాన్ని ప్రత్యక్ష ప్రదర్శనగా చూపించారు. తర తరాలుగా కొనసాగుతున్న సంప్రదాయ పద్దతులు, స్థానిక మామిడి కాయలు, మసాల దినుసులు, నిల్వ విధానాలపై ఆయన వివరించారు. ఈ వర్క్‌షాప్ కు తెలంగాణా ఛెఫ్స్ అసోసియేషన్ అధ్యక్షుడు అమేయ్ మరాఠే అసోసియేషన్ సభ్యులు పచ్చడి తయారీ చేస్తున్న వారికి మార్గదర్శనం చేసారు. సరైన మసాలా నిష్పత్తులు కలపడం, పరిశుభ్రత, నిల్వ విధానాలు వంటి అంశాలను తెలియజేసారు. పాల్గొన్న ప్రతి ఒక్కరూ వారు తయారు చేసుకున్న పచ్చడిని వారు ఇంటికి తీసికెళ్లే అవకాశాన్ని కల్పించారు. ఈ కార్యక్రమానికి పేరున్న కంపెనీలు తమ ఉత్పత్తులను అందజేసాయి.

## అంబేద్కర్ వర్సిటీలో ప్రొఫెసర్ రాంరెడ్డి విగ్రహావిష్కరణ

**జూబ్లీహిల్స్, మే 16, ప్రభాతవార్త:** దూరవిద్య పితామహుడు, ప్రఖ్యాత విద్యావేత్త, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ వ్యవస్థాపక వైస్ ఛాన్సలర్, ఇగ్నో వ్యవస్థాపకులు ఆచార్య జి. రాం రెడ్డి విగ్రహాన్ని విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య ఘంటా చక్రపాణి డా. బి. అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ ప్రాంగణంలో ఆవిష్కరించారు. విద్యా వారోత్సవాల్లో భాగంగా వర్సిటీలో లీడర్‌షిప్ కనెక్ట్ కార్యక్రమం సందర్భంగా ఈ కార్యక్రమం నిర్వహించారు. సీఎస్టీడీ భవనంలో నూతనంగా ఏర్పాటు చేసిన ప్రొఫెసర్ ఆర్వీఆర్ చంద్ర శేఖర్ రావు సినర్జీ హాల్‌ను ప్రారంభించారు. హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం పూర్వ ఆచార్యులు ఆచార్య జి. హరగోపాల్ మాట్లాడుతూ ప్రొఫెసర్ రాంరెడ్డి దూరవిద్య వ్యాప్తికి, అనేక ఉన్నత విద్యా సంస్థల ఏర్పాటుకు మూలకారకులు అని, ఆయన చేసిన సేవలకు గుర్తుగా ఎప్పుడో పద్మ అవార్డు రావాల్సిందని, ఇప్పటికి అయినా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పద్మ అవార్డుతో గౌరవించాలని విజ్ఞప్తి చేశారు. న్యాక్ మాజీ డైరెక్టర్, డా.బి.ఆర్.అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ మాజీ వీసీ ప్రొ.వి.ఎస్. ప్రసాద్ మాట్లాడుతూ ప్రొ. రాంరెడ్డి దార్శనికతను కొనియాడారు. ఆచార్య చక్రపాణి మాట్లాడుతూ దూరవిద్య విధానాన్ని దేశవ్యాప్తంగా విస్తరించడంతోపాటు అనేక సార్వత్రిక విశ్వవిద్యాలయాల ఏర్పాటుకు



విగ్రహావిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న ఆచార్య హరగోపాల్, ఘంటా చక్రపాణి, వీఎస్ ప్రసాద్ తదితరులు.

మార్గదర్శిగా ఈ యూనివర్సిటీ నిలిచిందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రొ. రాం రెడ్డి సతీమణి ప్రమీలారాంరెడ్డి, ఆయన కుమార్తె జ్యోతి, విశ్వవిద్యాలయ అకాడమిక్ డైరెక్టర్ ప్రొ.జి.పుష్పా చక్రపాణి, రిజిస్ట్రార్ డా.యల్.విజయా కృష్ణారెడ్డి, ప్రొ. డి. నరసింహా రెడ్డి, విశ్వవిద్యాలయ అధ్యాపకులు ప్రొ.పల్లవి కబ్డే, ఓఎస్డీ ప్రొ.రవీంద్రనాథ్ సోలమన్, ప్రొ.పి. వెంకట రమణ, ప్రొ. రజని, పలు విభాగాల అధిపతులు, డీన్స్, బోధన మరియు భోదనేతర సిబ్బంది, ఉద్యోగ సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు. అనంతరం వర్సిటీ ఆవరణలో బుక్ టాక్ కార్యక్రమాన్ని నిర్వహించారు.

## రక్తపోటుపై ప్రజలు అవగాహన కలిగియుండాలి : డాక్టర్ మనోజ్ రెడ్డి

**ముషీరాబాద్, మే 16 ప్రభాతవార్త:** రక్తపోటుపై ప్రజలలో అవగాహన పెంచడం, ఈ వ్యాధిని నివారించడానికి, నియంత్రించడానికి అన్ని దేశాల పౌరులను ప్రోత్సహించడమే ప్రపంచ రక్తపోటు దినోత్సవం ముఖ్యఉద్దేశమని ముషిరాబాద్ ప్రభుత్వ పట్టణ ప్రాధమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ ఎం.మనోజ్‌రెడ్డి చెప్పారు. ప్రపంచ రక్తపోటు దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం పట్టణ ప్రాధమిక ఆరోగ్య కేంద్రంలో రక్తపోటుపై ప్రజల్లో ఆయన అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్తపోటు వ్యాధికి దుమపానం చేయడం, ఎక్కువగా మద్యం సేవించడం, అధిక బరువు ఉండటం, శారిరక శ్రమలేకపోవడం, ఆహారంలో ఎక్కువగా ఉప్పు తీసుకోవడం మానసిక వత్తిడి వల్ల అధిక రక్తపోటు వస్తుందన్నారు. రక్తపోటు వ్యాధి గురించి ప్రతి ఒక్కరూ అవగాహన కలిగియుండాలని సూచించారు. రోజు తీసుకునే ఆహారంలో ఉప్పు తక్కువగా ఉండటం, ఆహారంలో కొవ్వు పదార్ధాలు పరిమితి మించకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. రక్తపోటు విషయంలో ఎవరూ అశ్రద్ద చేయకుండా ఎప్పటికప్పుడు డాక్టర్ల సలహాతీసుకుని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని డాక్టర్ సూచించారు.

## వయోధిక పాత్రికేయ సంఘం నూతన కార్యదర్శిగా శ్రీనివాసరెడ్డి

**హైదరాబాద్, మే 16, ప్రభాతవార్త:**

వయోధిక పాత్రికేయ సంఘం నూతన కార్యదర్శిగా ఎన్. శ్రీనివాస రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శనివారం హైదరాబాద్ ప్రెస్ క్లబ్‌లో అధ్యక్షులు దాసు కేశవ రావు అధ్యక్షతన జరిగిన సంఘం కార్యవర్గ సమావేశంలో కార్యదర్శి పదవి నుంచి స్వచ్చందంగా తప్పుకున్న కొండా లక్ష్మణ రావు స్థానంలో శ్రీనివాస రెడ్డి ఎన్నికయ్యారు. సంస్థ ఇరవై ఏళ్ళ క్రితం ఏర్పాటు అయినప్పటి నుంచి ఈస్థాయికి ఎదగడంలో సంస్థాపక అధ్యక్షులు వరదాచారితో కలిసి నిర్విరామంగా, అలుపెరుగని కృషి చేసిన లక్ష్మణ రావు శ్రమను ప్రశంసిస్తూ సమావేశం తీర్మానించింది. సంస్థ ఆర్ధిక పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని, ఆయన సొంత ఖర్చుతో కార్యకలాపాలను నిజాయితీతో, నిబద్ధతతో నిర్వహించారని కొనియాడింది. ఏ సంస్థ పురోగతి చెందాలన్నా లక్ష్మణరావు వంటి కష్టజీవుల అవసరం ఎంతైనా వుంటుందని వయోభారంతో సెలవు తీసుకుంటున్నట్టు ఆయన ప్రకటించి తప్పుకున్నారన్నారు. అయితే ముందు ముందు సంస్థ నిర్వహించే కార్యకలాపాలలో ఆయన సహాయ సహకారాలు అందించడానికి వీలుగా సంస్థ గౌరవ సలహా దారుగా వుండాలని సమావేశం ఆయనను అభ్యర్థించింది.

## హెచ్ఏఎల్ రాఘవేంద్ర కాలనీలో జనగణన కార్యక్రమం



జనగణన కార్యక్రమంలో వివరాలు సేకరిస్తున్న దృశ్యం

**పేట్ బషీరాబాద్, మే 16, ప్రభాతవార్త**

కాలనీ వాసులందరూ సహకరించి కేంద్ర ప్రభుత్వం చేపట్టిన జనగణన కార్యక్రమంలో పాల్గొనాలని అధికారులు కోరారు. శనివారం హెచ్ఏఎల్ రాఘవేంద్ర కాలనీలో జనగణన కార్యక్రమం నిర్వహించబడింది. ఎన్యుమరేటర్ సుధేష్ణ ఇంటింటికి వెళ్లి డోర్ టు డోర్ సర్వే నిర్వహిస్తూ ప్రజలకు జనగణన ప్రాముఖ్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు కుంట సిద్దిరాములు, బృందావన్ కాలనీ మాజీ అధ్యక్షుడు పోగు సమ్మన్న, నేత సృజన్ కుమార్ పాల్గొన్నారు. జనగణన కార్యక్రమం 11-05-2026 నుండి 09-06-2026 వరకు కొనసాగనుంది. ఈ సందర్భంగా ఆధార్ కార్డు, పాన్ కార్డు, బ్యాంకు ఖాతా వివరాలు, ఓటీపీ వంటి వ్యక్తిగత సమాచారాన్ని ఎవరికీ ఇవ్వవద్దని అధికారులు ప్రజలకు సూచించారు.

## మహాలక్ష్మి జ్యుయెలర్స్‌లో ఉద్యోగి చేతివాటం

**జూబ్లీహిల్స్, మే 16, ప్రభాతవార్త:**

జూబ్లీహిల్స్‌లోని మహాలక్ష్మి జువెలర్స్‌లో ఒక ఉద్యోగి చేతివాటం ప్రదర్శించి బంగారు గొలుసు కాజేశాడు. జూబ్లీహిల్స్ పోలీసుల కథనం ప్రకారం.. జూబ్లీహిల్స్ రోడ్ నంబరు 45లోని మహాలక్ష్మి జువెలర్స్‌లో మారుతి(19) ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. స్టోర్‌కు వచ్చిన కస్టమర్లకు బంగారు గొలుసులను చూపించే క్రమంలో పై అంతస్థు నుంచి కింది అంతస్థుకు లిఫ్టులో వస్తుండగా తన చూపాల్సిన రెండు బంగారు గొలుసుల్లోని ఒక గొలుసును జేబులో వేసుకున్నాడు. మరో గొలుసును కస్టమర్‌కు చూపించి నెమ్మదిగా షాపు నుంచి జారుకున్నాడు. అనంతరం అతని సెల్‌ఫోన్ అందుబాటులో లేకుండా చేశాడు. దీంతో స్టోర్ మేనేజర్ కమల లక్ష్మి నారాయణ జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. 35 గ్రాముల బంగారు గొలుసును ఎత్తుకెళ్లాడంటూ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈమేరకు పోలీసు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

**లీలా హోటల్‌లో మరో సంఘటన..**

బంజారాహిల్స్‌లోని లీలా హోటల్‌కు వచ్చిన ఒక చెన్నై వాసి బంగారు గొలుసు మాయమైంది. బంజారాహిల్స్ పోలీసుల కథనం ప్రకారం.. చెన్నైకి చెందిన దేవదాస్ ఈ నెల 10న బంజారాహిల్స్‌లోని లీలా హోటల్‌కు వచ్చాడు. 11వ తేదిన స్నానానికి వెళ్లే సమయంలో తన మెడలోని దాదాపు 60 గ్రాముల బంగారు గొలుసును తీసి బల్ల మీద పెట్టి మరిచి పోయాడు. 12వ తేదిన గది ఖాళీ చేసి చెన్నైకి వెళ్లాక గొలుసు సంగతి గుర్తుకొచ్చింది. దీంతో హోటల్ నిర్వాహకులకు ఫోన్ చేసి సమాచారం అందించాడు. గొలుసు లభించకపోవడంతో అతని మేనేజర్ ధర్మేంద్ర ద్వారా బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## వెంటపడుతున్నాడని 60 ఏళ్ల వృద్ధుడిపై ఫిర్యాదు

**జూబ్లీహిల్స్, మే 16, ప్రభాతవార్త:**

అరవై ఏళ్ల వృద్ధుడు పెళ్లి పేరుతో తన వెంటపడుతున్నాడని, అతనిపై చర్యలు తీసుకోవాలంటూ ఒక మహిళ(42) బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. బంజారాహిల్స్ పోలీసుల కథనం ప్రకారం.. బంజారాహిల్స్‌లో నివసించే ఒక మహిళకు బంజారాహిల్స్ రోడ్ నంబరు 1లో ఒక స్టోర్ ఉంది. కాగా ఇష్తికార్(60) అనే వ్యక్తి గత కొద్ది కాలంగా ఆమె వెంటపడుతున్నాడు. ఎన్నిమార్లు చెప్పినా అతను పద్ధతి మార్చుకోకుండా ఆమెను పెళ్లి చేసుకుంటానని ఇబ్బంది పెడుతుండటంతో ఆమె షీ బృందాన్ని ఆశ్రయించింది. షీ బృందం సూచనల మేరకు బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ఉప్పల్‌లో దోపిడికి పాల్పడిన నిందితుడి అరెస్ట్

**ఉప్పల్, మే 16 ప్రభాతవార్త :** ఒక మహిళపై దాడి చేసి ఆమె వద్ద నుంచి నగదు, ఇతర వస్తువులు పాల్పడిన నిందితుడిని శనివారం ఉప్పల్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. సిఐ వై.రామలింగారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. కర్నూల్ జిల్లా రమాదేవి(45) కర్మన్‌ఘాట్ వద్దెర బస్తీలో నివాసం ఉంటుంది. అయితే ఈనెల 14వ తేదిన మధ్యాహ్నం 2.30 గంటల సమయంలో ఎల్బీనగర్ రింగ్ రోడ్ వద్ద తన చిన్న కుమార్తె ఇంటికి వెళ్లడానికి నిలబడి ఉండగా, ఒక గుర్తుతెలియని వ్యక్తి తన వద్దకు వచ్చి ఉప్పల్ లోని ఒక ఫార్మా కంపెనీలో చెట్లకు నీళ్లు పోయడం మరియు శుభ్రం చేసే పని ఉందని, ఒక గంట పని చేస్తే రూ.రెండు వేలు ఇస్తానని చెప్పాడు. అతని మాటలు నమ్మి అతనితో వెళ్లగా, అతను సమీపంలోని చెట్లు ఎక్కువగా ఉన్న నిర్జన ప్రదేశానికి తీసుకెళ్లి అసభ్యంగా ప్రవర్తించినట్లు తెలిపారు. ఆమె గట్టిగా అరవడంతో ముఖం, మెడ, వెన్నుపై చేతులతో కొట్టి బెదిరించి, ఆమె వద్ద ఉన్న ఒప్పో సెల్ ఫోన్, రూ.4 వేల నగదు బలవంతంగా లాక్కొని అక్కడి నుండి పారిపోయినట్లు తెలిపారు. పోలీసులు విచారణ చేయగా నిందితుడి ఉప్పల్ శాంతినగర్‌కు చెందిన దేశపాక లక్ష్మణ్ (22)గా గుర్తించినట్లు తెలిపారు. నిందితుడు బస్ స్టాప్‌లు, లేబర్ అడ్డాల వద్ద ఒంటరిగా ఉన్న మహిళలను లక్ష్యంగా ఎంచుకుని, ఉప్పల్‌లో నిఫార్మా కంపెనీలో చెట్లకు నీళ్లు పోయడం, శుభ్రం చేసే పని ఉందని చెప్పి, గంట పని చేస్తే రూ.2వేలు ఇస్తానని నమ్మించి వారిపై దాడులకు పాల్పడుతాడని తెలిపారు. నిందితుడు మద్యం సేవించడం వంటి చెడు అలవాట్లకు బానిసయ్యాడని, సులభంగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో గత 2022 సంవత్సరంలో ఎన్డీపీఎస్ కేసులో ఉప్పల్ పోలీస్ స్టేషన్ పరిధిలో జైలుకు వెళ్లివచ్చినట్లు తెలిపారు. ఈ మేరకు ఉప్పల్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## ఘనంగా శనైశ్చర జయంతి
-మల్లికార్జునస్వామి ఆలయంలో ప్రత్యేకపూజలు


పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

**సదాశివపేట, మే 16, ప్రభాతవార్త:**
అమావాస్య, శనివారం, శనైశ్చరజయంతి ఒకేరోజురావడంతో సదాశివపేటలోని శ్రీభ్రమరాంబసమేత మల్లికార్జునస్వామి దేవాలయం భక్తులతో కిక్కిరిసిపోయింది. ఈ విశిష్టమైన రోజును పురస్కరించుకుని ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు ఘనంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరై స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. హిందూ సంప్రదాయం ప్రకారం ప్రతి అమావాస్యనాడు పరమశివుడిని భక్తిశ్రద్ధలతో ఆరాధించడం ఆనవాయితీ. అయితే ఈసారి అమావాస్య శనివారం రావడం తోపాటు శనైశ్చరజయంతి కూడా అదేరోజు కావడం విశేష ప్రాధాన్యత సంతరించుకుంది. ఆలయంలో భక్తులు ఉదయం నుంచే భారీగా తరలివచ్చి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. 1983-84 సంవత్సరంలో పదవ తరగతి చదివిన పూర్వవిద్యార్థులమిత్రబృందం ఆధ్వర్యంలో మహాపూజాకార్యక్రమం నిర్వహించారు. ఉపాధ్యాయుడు కిష్టయ్య దంపతులు ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం ఆలయానికి విచ్చేసిన భక్తులకు అన్నప్రసాదం పంపిణీ చేశారు. స్వామివారిని దర్శించుకునేందుకు సదాశివపేట మాజీ మున్సిపల్ చైర్మన్, ప్రస్తుత కోఆప్షన్ సభ్యుడు సత్యనారాయణ, మాజీ వైస్ చైర్మన్ చింత గోపాల్, అశోక్, మున్సిపల్ మేనేజర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్‌తో పాటు పలువురు ప్రముఖులు హాజరయ్యారు. ఈ కార్యక్రమాన్ని పూర్వ విద్యార్థుల మిత్రబృందం అధ్యక్షుడు గంట శివయ్య ఆధ్వర్యంలో శంకర్ గౌడ్, పృథ్వీరాజ్, శ్రీనివాస్ రెడ్డి, కొండల్, వెంకట్రావు, జనార్ధన్, సంగమేశ్వర్, నందు, రవి, ప్రమోద్ పటేల్, కంద్రిష్ణ, రజనీకాంత్, రవి టీచర్ తదితరులు సమన్వయం చేశారు.

## కొప్పులపల్లిలో రైతుముంగిట్లో శాస్త్రవేత్తలు


రైతు ముంగిట్లో శాస్త్రవేత్తల కార్యక్రమం

**వెల్దుర్తి, మే 16, ప్రభాతవార్త:**
మాసాయిపేట మండలంలోని కొప్పుల పల్లి గ్రామంలో ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్త డాక్టర్ త్రివేణి రైతులకు వివిధ అంశాలపై అవగాహన కల్పించడం జరిగింది. ఈ సందర్భంగా త్రివేణి మాట్లాడుతూ ఎరువుల వినియోగం ఎక్కువగా వినియోగించుకోవద్దని సరైన మోతాదులో మాత్రమే వినియోగించుకోవాలని సూచించారు. ఎక్కువ ఎరువులు వినియోగించుకోవడం వల్ల నేల ఆరోగ్యం దెబ్బతీస్తుందని పెట్టుబడి ఖర్చు పెరగడమే గాక రోగాలు అధికంగా వస్తాయన్నారు. సేంద్రియ ఎరువులను విరివిగా వాడాలని తద్వారా అధిక దిగుబడులు పొందవచ్చని అన్నారు. కార్యక్రమంలో శోభనరసింహారెడ్డి, ఉపసర్పంచ్ జయరాములు, ఏఈఓ రజిత, రైతులు పరమేష్, రఘుపతి, స్వామి, రాజయ్య, ఎల్లయ్యతోపాటు పలువురు పాల్గొన్నారు.

## బైక్ వదిలి సైకిల్‌పై ప్రయాణం
**చిన్నశంకరంపేట, మే 16, ప్రభాతవార్త:**
ప్రధాని నరేంద్ర మోడీ ఇంధనం ఆదా చేయాలని ఇచ్చిన పిలుపు మేరకు ఓ చిరు ఉద్యోగి బైక్ వదిలి సైకిల్‌పై ప్రయాణిస్తున్నాడు. రామాయంపేట మండలం ఝాన్సిలింగాపూర్ గ్రామానికి చెందిన రాజయ్య చిన్నశంకరంపేట మండలం ఖాజాపూర్‌లోని ఓ పరిశ్రమలో అకౌంటెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. కాగా ఇటీవల ఇంధనం పొదుపుచేయాలన్న ప్రధాని మోడీ పిలుపునకు స్పందించి రోజూ 8 కిలోమీటర్లు ప్రయాణించి ఉద్యోగం చేస్తున్నాడు. ఇంధన ఆదాకోసం మండలంలోని పలువురు సైకిళ్లపై ప్రయాణం సాగిస్తున్నారు.

## విజయవంతంగా ఉచిత వైద్యశిబిరం
-వైద్య శిబిరాన్ని ప్రారంభించిన సర్పంచ్ తుల్చమ్మ బిక్షపతి


ఉచిత వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్ తుల్చమ్మ బిక్షపతి

**నర్సాపూర్, మే 16, ప్రభాతవార్త:**
నర్సాపూర్ మండల పరిధిలోని అచ్చంపేట గ్రామంలో మల్లారెడ్డి ఆసుపత్రి ఆధ్వర్యంలో శనివారం ఉచిత వైద్యశిబిరాన్ని ఏర్పాటుచేశారు. ఈ శిబిరాన్ని గ్రామ సర్పంచ్ తుల్చమ్మ బిక్షపతి హాజరై ప్రారంభించారు. అనంతరం మల్లారెడ్డి ఆసుపత్రి డాక్టర్ నిఖిల్, డాక్టర్ మహమూద్, డాక్టర్ నాగప్ప లు గ్రామస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈపరీక్షల్లో అవసరమైన వారికి మందులు ఉచితంగా పంపిణీ చేశారు. అంతేగాక ఇంకొంతమందికి ఎక్సేలు స్కానింగ్ టెస్టులు చేయడానికి కోసం ఆసుపత్రికి రావాలని సూచించారు. ఈ ఉచిత వైద్య శిబిరంలో సుమారు 150 మందికి వైద్య పరీక్ష నిర్వహించి మందులు పంపిణీచేయడంతో విజయవంతంగా ముగిసింది. ఈసందర్భంగా గ్రామసర్పంచ్ తుల్చమ్మ బిక్షపతి మాట్లాడుతూ మారుమూల గ్రామమైన అచ్చంపేట గ్రామంలో ఈ ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించడం ఎంతో అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ నవీన్ వార్డు సభ్యులు వరమ్మ పెంటయ్య, నరసమ్మ భూమయ్య, ఆసుపత్రి సిబ్బంది సోనీ, నిహారిక, వై సోని, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## పద్మశాలి నిరుపేదలకు చేయూత
-గజ్వేల్-ప్రజ్ఞాపూర్ పద్మశాలి సంఘం అధ్యక్షులు దేవదాస్

**గజ్వేల్ టౌన్, మే 16, ప్రభాతవార్త:**
గజ్వేల్ మండల పరిధిలోని ర్యాగట్లపల్లి గ్రామానికి చెందిన షేర్ల భూలక్ష్మి భర్త కృష్ణ గత రెండుసంవత్సరాలుగా అనారోగ్యంతో బాధపడుతూ, రెండు కాళ్లు విరగడం, వెన్నుపూస నొప్పితో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటుండగా కుటుంబపోషణ భారమైంది. విషయం తెలుసుకున్న గజ్వేల్-ప్రజ్ఞాపూర్ పద్మశాలి సేవాసంఘం, యువజన సంఘం సభ్యులు స్పందించి 7వ సేవా కార్యక్రమంలో భాగంగా బాధిత కుటుంబానికి రెండు నెలలకు సరిపడా నిత్యావసర సరుకులతోపాటు రూ.8వేల నగదు అందజేశారు. ఈసందర్భంగా పద్మశాలి సంఘం గజ్వేల్-ప్రజ్ఞాపూర్ అధ్యక్షులు బొల్లిబత్తుల దేవదాస్ మాట్లాడుతూ ఈ సేవా కార్యక్రమానికి తలకొక్కుల శ్రీలత మధుసూదన్, దుదుక చక్రధర్, స్వర్గం శ్రీనివాస్, గాడిపల్లి అనూప్, దేవసాని హనుమాన్‌దాస్, వడ్డేపల్లి సత్యనారాయణ, తలకొక్కుల ప్రేమ్‌కుమార్‌లు ఆర్థిక సహకారం అందించినట్లు తెలిపారు. బాధితకుటుంబానికి మరింత సహాయం చేయాలనుకునే దాతలు 9177646387 నెంబర్‌కు ఫోన్‌పే ద్వారా అందించాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మంతూరి సౌందర్య రాజు, మాజీ సర్పంచ్ మహేషుని పాండు, వడ్డేపల్లి కరుణాకర్, నాగపురి చంద్రం, స్వర్గం చంద్రం, దేవసాని వాసుదేవ్, గజ్వేల్ యుజవన సంఘం ఉపాధ్యక్షులు షేర్ల నర్సింలు, మాదాసు కృష్ణ, మంగళపల్లి సత్యనారాయణ, పెండెం కృష్ణ, సుధాకర్, కోటి, గ్రామస్తులు రాములమ్మ, సంజీవులు, యాదగిరి, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## ఆల్ ఇండియా వీరశైవ మహాసభను జయప్రదం చేయాలని గోడపత్రిక విడుదల


గోడ పత్రికను విడుదల చేస్తున్న దృశ్యం

**సదాశివపేట, మే 16, ప్రభాతవార్త:**
ఈనెల 23న హైదరాబాదులో శ్రీ ఆది జగద్గురుపంచాచార్య యుగ మానోత్సవం. శ్రీ మహాత్మ బసవేశ్వర జయంతి ఉత్సవాల లో భాగంగా ఈ భ్రమరాంబ మల్లికార్జున స్వామి కళ్యాణ మండపం హైదర్ నగర్ లో నిర్వహించే ఆల్ ఇండియా వీరశైవసమాజం. మహాసభ కార్యక్రమంలో జిల్లాలోని వీరశైవ లింగాయత్ కులబాంధవులు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఎడ్లబజార్ వీరశైవ లింగాయత్ సమాజం అధ్యక్షులు గందిగే రాజు, సభ్యులు శనివారం బసవేశ్వర మందిరంలో గోడ పత్రికను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మే 23 వ తేదీన హైదరాబాద్‌లో ఆల్ ఇండియా వీరశైవ మహాసభలో స్థానికసంస్థల ఎన్నికలలో విజయం సాధించిన వీరశైవ లింగాయత్, ప్రజా ప్రతినిధులకు సన్మాన కార్యక్రమం ఏర్పాటుచేశారు. ఈకార్యక్రమంలో వీరశైవ కుల బాంధవులు అధిక సంఖ్యలో పాల్గొని జగద్గురువుల ఆశీర్వదం పొంది కార్యక్రమం జయప్రదం చేయగలరని ఆయన కోరారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి సిద్దికేర్ వినోద్, కోశాధికారి అమరాధి రాచన్న, జిల్లా ఉపాధ్యక్షులు వీర మహేందర్ అడ్వకేట్, సమాజ సభ్యులు రాచప్ప, రమేష్, రవి, సురేష్, శేఖర్, శేఖర్, సతీష్, రవణప్ప, షాబాద్ వీరన్న, విశ్వనాథ్, ప్రవీణ్, లోకేష్, మల్లేశం, వైద్యనాథ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రాథమిక శిక్షణ నైపుణ్యవర్గ ప్రారంభం
-హాజరైన ప్రముఖ వక్తలు


కార్యక్రమంలో మాట్లాడుతున్న అశోక్‌గౌడ్

**నర్సాపూర్, మే 16, ప్రభాతవార్త:**
నర్సాపూర్ పట్టణంలోని శ్రీవత్సల్ గురుకుల విద్యాలయంలో ఎకల్ అభియాన్ సంస్థ ఆధ్వర్యంలో ప్రాథమిక శిక్షణ నైపుణ్యవర్గ(శిక్షణతరగతులు) శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో విద్యావికాసం, సామాజిక చైతన్యం లక్ష్యంగా పనిచేస్తున్న ఈసంస్థ, కార్యకర్తల నైపుణ్యాలను పెంపొందించేందుకు ఈ ఐదురోజుల శిక్షణ శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిక్షణ మే 15 నుండి మే 19 వరకు ఐదు రోజుల పాటు శిక్షణ తరగతులకు నిర్వహించనున్నారు. ఈ శిక్షణకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల నుండి పెద్దసంఖ్యలో కార్యకర్తలు హాజరయ్యారు. శిబిరంలోభాగంగా కార్యకర్తలకు క్షేత్రస్థాయిలో విద్యనందించే విధానాలు, వ్యక్తిత్వ వికాసం, సామాజిక సేవా కార్యక్రమాలపై నిపుణులు శిక్షణ ఇవ్వనున్నారు. మూడురాష్ట్రాలనుండి వచ్చిన కార్యకర్తలతో గురుకులప్రాంగణం ఆధ్యాత్మిక, సేవాభావంతో సందడిగామారింది. ఈవర్గ ప్రారంభోత్సవంలో సంగారెడ్డి అంచల్ యువప్రముఖ్ అశోక్‌గౌడ్, సంగారెడ్డి అంచల్ ప్రాథమిక ప్రశిక్షణ ప్రబారి ధన్‌సింగ్, అభియాన్ కార్యకర్తలు ఓంప్రకాష్, కేంద్రీయ ప్రాథమిక ప్రశిక్షణ ప్రముఖ్, కర్తార్ సౌత్ భారత్ కార్యకర్త విభాగం ప్రముఖ్, రాఘవేందర్, దక్షిణభారతదేశ గ్రామ సంఘటన ప్రముఖ్, కోటేశ్వర్, ఉత్తర తెలంగాణ సంభవ్ ప్రాథమిక ప్రశిక్షణ ప్రముఖ్ చంద్రశేఖర్, సంగారెడ్డి అంచల్ కార్యాలయ ప్రముఖ్‌లు పాల్గొన్నారు.

## పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి
-సర్పంచ్ పోసాన్‌పల్లి రాజు


గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ రాజశేఖర్

**జగదేవ్‌పూర్, మే 16, ప్రభాతవార్త:**
వ్యక్తిగత పరిశుభ్రత పాటించడంతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తిమ్మాపూర్ గ్రామ సర్పంచ్ పోసాన్‌పల్లి రాజు, తీగుల్ పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ రాజశేఖర్‌లు అన్నారు. శనివారం డెంగ్యూ వ్యాధి నిర్మూలనపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా గ్రామంలో ప్రజలతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో గత సంవత్సరంలో డెంగ్యూ వ్యాధినపడి కొంతమంది ప్రాణాలు పోగొట్టుకున్నారని, అలాంటి పరిస్థితులు పునరావృతం కాకుండా డెంగ్యూ నివారణ చర్యలు చేపట్టాలని అన్నారు. దీనికి ప్రజలందరూ పరిశుభ్రతను పాటించి ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ ఫాతిమా, ఏఎన్ఎం రజిత, ఆశా వర్కర్ ఉమారాణి, ఉపసర్పంచ్ అక్కరాజు నాగరాజు, వార్డు సభ్యులు కొంతం రామచంద్రం, పోసాన్‌పల్లి కిష్టయ్య, కుమార్, గ్రామస్తులు గుండ్రు ఉప్పలయ్య, నర్సింగం, కొంతం కిష్టయ్య, మహేష్ పాల్గొన్నారు.

## లబ్దిదారులకు సిఎంఆర్ఎఫ్ చెక్కుల అందజేత
**మిరుదొడ్డి, మే 16, ప్రభాతవార్త:**
అక్బర్‌పేట-భూంపల్లి మండలానికి చెందిన వివిధ గ్రామాల లబ్దిదారులకు రూ.3,07,000 సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను దుబ్బాక నియోజకవర్గ కాంగ్రెస్‌పార్టీ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి ఆదేశాల మేరకు దుబ్బాక బ్లాక్ కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షులు పాతూరి వెంకటస్వామిగౌడ్ లబ్దిదారులకు అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల ఆరోగ్యరక్షణకు కాంగ్రెస్ సర్కార్ ఎల్లప్పుడు కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, పార్టీనాయకులు అన్నబోయిన చంద్రశేఖర్, కోనపురం బాల్‌యాదవ్, రామగల్లస్వామి, కూతురి సుమలత, మలక్ మల్లేశం, రెడ్డిపల్లి నర్సింహ్మారెడ్డి, వెంకటేశం, సురేందర్‌రెడ్డి, రాజు, నరేష్, అశాగౌడ్, హైమద్, ప్రదీప్‌రెడ్డి, మహేందర్, శ్రీధర్‌గౌడ్, రాములు, శ్రీను పాల్గొన్నారు.

## ఉచిత భోజనాన్ని ఏర్పాటుచేసిన డాక్టర్
**వెల్దుర్తి, మే 16, ప్రభాతవార్త:**
మండల కేంద్రమైన వెల్దుర్తిలో శనివారం డాక్టర్ శ్రీనివాస్ వారి తండ్రిగారైన కీర్తిశేషులు డాక్టర్ నరసింహులు, వీరి బాబాయ్ అయిన కీర్తిశేషులు మెడికల్ సిద్దిరాములుల జ్ఞాపకార్థం శ్రీవేంకటేశ్వర నర్సింగ్‌హోమ్ వద్ద ప్రజలకు ఉచితభోజన ఏర్పాట్లు నిర్వహించారు. వేసవికాలం కావడంతో ప్రజలకు సౌకర్యార్థం చలివేంద్రం ఏర్పాటు చేసి చల్లటి నీటిని అందిస్తున్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ ఆదర్శ్, ఉపసర్పంచ్ శ్రావణ్‌కుమార్, చందులతోపాటు పలువురు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబీకులకు పరామర్శ
**మిరుదొడ్డి, మే 16, ప్రభాతవార్త:**
విశ్రాంత ఉద్యోగిగా, వ్యాపారిగా, మిరుదొడ్డి నీటి సంఘం చైర్మన్‌గా ఆయా రంగాల్లో లింగాల రామకృష్ణారెడ్డి విశేష సేవలు అందించారని ఆయన సేవలు మరవలేనివని సిద్దిపేట టిఎన్జీవో భవన్ ప్రతినిధులు అన్నారు. ఇటీవల మరణించిన రామకృష్ణారెడ్డి కుటుంబీకులను మిరు దొడ్డిలో పరామర్శించి ఓదార్చారు. అలాగే ప్రశాంత్‌నగర్ మాజీ ఉప సర్పంచ్ చెందిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, రెడ్డిసంఘం అధ్యక్షులు పెరుడి వెంకట్ రెడ్డిలు రామకృష్ణారెడ్డి కుటుంబీకులను పరామర్శించి ఓదార్చారు.

## యువత స్వశక్తితో ముందుకు పోవాలి
-హోటల్ టి 4 యు ప్రారంభించిన కాంగ్రెస్ నాయకులు పులిమామిడి రాజు


స్వయం ఉపాధి కేంద్రాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

**సదాశివపేట, మే 16, ప్రభాతవార్త:**
నేటి సమాజంలో యువత స్వశక్తితో ముందుకు సాగినప్పుడే ఆర్థికంగా ఎదుగుతారని రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ నాయకులు పులిమామిడి రాజు అన్నారు. శనివారం సదాశివపేట పట్టణంలోని కొత్త రిజిస్ట్రేషన్ కార్యాలయం ఎదుట, జాతీయ రహదారి ఎన్‌హెచ్65 పక్కన నూతనంగా ఏర్పాటు చేసిన టీ 4 యు హోటల్‌ను ఆయన ముఖ్యఅతిథిగా హాజరై రిబ్బన్ కట్‌చేసి ప్రారంభించారు. అబ్దుల్ రజాక్ కుటుంబ సభ్యులు ఆధునిక సౌకర్యాలతో ఈ హోటల్‌ను ఏర్పాటుచేశారు. ఈసందర్భంగా పులిమామిడి రాజు మాట్లాడుతూ స్థానికప్రజలకు రుచికరమైన, నాణ్యమైన ఆహారం అందించాలని ఆకాంక్షించారు. యువత స్వయం ఉపాధి దిశగా అడుగులువేయడం అభినందనీయమని, వ్యాపారరంగంలో యువకులు ముందుకురావడం వల్ల స్థానికంగా ఉపాధి అవకాశాలు పెరుగుతాయని తెలిపారు. కార్యక్రమంలో ఎండి ఫయాజ్, ఎండి నిసార్, అబ్దుల్ రజాక్, ఎండి అబ్దుల్, మోయిన్, ఎండి ఇంతియాజ్ తదితరులు పాల్గొన్నారు.

## రూ.2 లక్షల ఇన్స్యూరెన్స్ చెక్ పంపిణీ
**కొల్చారం, మే 16, ప్రభాతవార్త:**
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రంగంపేట బ్రాంచ్ లో లో ప్రధాన్ మంత్రి జీవన్‌జ్యోతి బీమా యోజన కింద ఇన్స్యూరెన్స్ చెక్ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. కౌడిపల్లి మండలం బుజరంపేట గ్రామానికి చెందిన రెడ్డిమల్లి రామ అనారోగ్యంతో మృతిచెందగా, వారి నామినీ కె.విద్యాసాగర్‌కు రూ.2 లక్షల ఇన్స్యూరెన్స్ చెక్కును అందజేశారు. ఈసందర్భంగా బ్యాంకు అధికారులు మాట్లాడుతూ, కేంద్రప్రభుత్వం అమలుచేస్తున్న పథకంద్వారా సామాన్య ప్రజలకు ఆర్థికభద్రత కలుగుతోందని తెలిపారు. తక్కువ ప్రీమియంతో కుటుంబాలకు అత్యవసర సమయంలో ఆర్థికసహాయం అందించే ఈ పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్బిఐ రంగంపేట బ్యాంక్ సిబ్బంది,కొల్చారం కౌన్సిలర్లు డి. ఆసిఫ్, సీహెచ్. దుర్గేష్, షేక్ సానియా తదితరులు పాల్గొన్నారు.

## మృతురాలి కుటుంబానికి ఆర్థికసహాయం
**కొండపాక, మే 16, ప్రభాతవార్త:**
కుకునూరుపల్లి మండల పరిధిలోని లకుదారంగ్రామానికి చెందిన యెల సుశీల అనారోగ్యంతో బాధపడుతూ మృతిచెందింది. ఈవిషయం తెలుసుకున్న ఎంపిటిసిల ఫోరం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, వైస్ ఎంపిపి దేవి రవీందర్ శుక్రవారం మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించి, ఓదార్చి, గ్రామ పాలకవర్గంతో కలిసి మృతురాలి కుమారుడు అజయ్‌కి రూ.5వేల ఆర్థికసహాయం అందించారు. ఆయనవెంట కార్యక్రమంలో సర్పంచ్ శిల్పనర్సింలు, ఉపసర్పంచ్ యెల్లు శ్రీనివాస్‌రెడ్డి, వార్డు సభ్యులు దేవి నర్సింలు, చింతల ప్రవీణ్, చిరబోయిన సాయిలు, గట్టు చంద్రం, బిఆర్‌ఎస్ నాయకులు సంతోష్, యెల కిష్టయ్య, యెల మల్లేశం, కనకయ్య పాల్గొన్నారు. గ్రామానికిచెందిన శివాజీయూత్ అసోసియేషన్ సభ్యులు మృతురాలి కుటుంబసభ్యులకు ఆర్థికసహాయం అందించారు.

### మృతుని కుటుంబసభ్యులను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే
**మనూర్, మే 16, ప్రభాతవార్త:**
మండల పరిధిలోని ఉసిరికెపల్లి గ్రామానికి చెందిన మచ్చేందర్‌రరావు పాటిల్ ఇటీవల మృతిచెందినట్లు తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి శనివారం ఉసిరికెపల్లి గ్రామంలోని మచ్చేందర్‌రావు పాటిల్ నివాసానికి చేరుకుని మచ్చేందర్‌రావు పాటిల్ చిత్ర పటానికి నివాళులు అర్పించి కుటుంబ సభ్యులకు సానుభూతి ప్రకటించారు. మాజీ ఎమ్మెల్యే వెంట మండల బిఆర్‌ఎస్ అధ్యక్షులు విటల్‌రావుపాటిల్, సర్పంచ్ రాజేందర్‌రావు, అనిల్‌రావు, మారుతిరావు, వెంకట్‌రావు, రామారావు, దిగంబర్‌రావ్, దిలీప్‌రావు తదితరులు ఉన్నారు.

## పేదప్రజల శ్రేయస్సే కాంగ్రెస్ ధ్యేయం
-సిద్దిపేట నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి :హరికృష్ణ

**సిద్దిపేట అర్బన్, మే 16, ప్రభాతవార్త:**
పేదప్రజల ఆరోగ్యం,శ్రేయస్సే కాంగ్రెస్ సర్కార్ ధ్యేయమని సిద్దిపేట నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ అన్నారు. జిల్లా కేంద్రంలోని పార్టీ క్యాంపు కార్యాలయంలో శనివారం నియోజకవర్గంలోని వివిధమండలాలకు చెందిన 80మంది లబ్దిదారులకు రూ.38లక్షల సిఎం ఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీచేసి మాట్లాడారు. ఆపదలో ఉన్న ప్రజలకు సిఎం సహాయ నిధి అండగా నిలుస్తుందన్నారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి వివేక్ వెంకటస్వామి సహాయసహకారాలతో నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో పార్టీనాయకులు కలీం, దాస అంజయ్య, అంజిరెడ్డి, రాజబహుదూర్‌రెడ్డి, మహిపాల్‌రెడ్డి, మల్లా రెడ్డి, వంశీ, శ్రీనివాస్, అజమాత్, అనిల్‌కుమార్‌రెడ్డి, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

## డెంగ్యూరహిత జిల్లాగా మార్చుదాం
-డిఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ ధనరాజ్



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న డిఎంఅండ్‌హెచ్‌ఓ ధనరాజ్

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:**
డెంగ్యూవ్యాధి లక్షణాలను తొలిదశలోనే గుర్తించి పూర్తిగా నిర్మూలించేంతవరకు వైద్య ఆరోగ్య సిబ్బంది కృషి చేయాలని డిఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ ధనరాజ్ ఆదేశించారు. జాతీయ డెంగ్యూదినోత్సవం సందర్భంగా శని వారం జిల్లా కలెక్టరేట్‌లోని ఆరోగ్యశాఖ కార్యాలయంలో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. అనంతరం కీటక జనిత వ్యాధుల నియంత్రణ అధికారి డాక్టర్ శ్రీకాంత్‌యాదవ్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన అవగాహన ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. దోమలు పుట్టకుండా, కుట్టకుండా జాగ్రత్తలు పాటించాలని నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం మానవహారం నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యులు, సిబ్బంది చక్రధర్, కోటేశ్వరరావు, ఆంజనేయులు, శ్రీనివాస్, సంతోష్‌రెడ్డి, బిక్షపతి, ఫరీద్, ప్రభు, బాలమణి, స్వామి, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను వెంటనే కేటాయించాలి
**షాద్‌నగర్, మే 16, ప్రభాతవార్త:**
పేదప్రజలు ఎన్నోసంవత్సరాలుగా స్వంత ఇంటి కోసం ఎదురుచూస్తున్నారు. ప్రభుత్వం నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లను నిజమైన అర్హులైన నిరుపేదలకు పారదర్శకంగా, రాజకీయ పక్షపాతం లేకుండా వెంటనే కేటాయించాలని ఈరోజు సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో మున్సిపల్ చైర్మన్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈసందర్భంగా సిపిఎం పార్టీ జిల్లా నాయకులు ఎన్ రాజు, పట్టణ కార్యదర్శి శ్రీను నాయక్‌లు మాట్లాడుతూ షాద్నగర్ మున్సిపాలిటీ పరిధిలో నివసిస్తున్న నిరుపేద ప్రజలకు ప్రభుత్వం నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లను వెంటనే కేటాయించాలని వారు విజ్ఞప్తిచేశారు. అదేవిధంగా పట్టణంలో అనేకమంది పేద ప్రజల స్వంత ఇల్లు లేక అద్దె ఇంట్లో ఇబ్బందికర పరిస్తితుల్లో జీవనం కొనసాగిస్తున్నారు. ప్రభుత్వం పేదల సంక్షేమం కోసం నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు నిజమైనవారిని గుర్తించి పారదర్శకంగా కేటాయించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ నాయకులు లక్ష్మి, కావాలి రాజు, మహమ్మద్ బాబు, పారిజాత, మీనాజీ బేగం, లలిత, శ్రీలత, అంజమ్మ, అంగోత్ లక్ష్మి, శ్రీకాంత్, ముఖిత్, సంతోష తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌తోనే సొంతింటికల సాకారం
**కుల్కచర్ల, మే 16, ప్రభాతవార్త:**
కాంగ్రెస్ ప్రభుత్వంతోనే పేదల సొంతింటి కల సాకారం అవుతుందని డాక్టర్ రిత్విక్ రెడ్డి, డిసిసి జిల్లా ఉపాధ్యక్షులు భీంరెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు గోపాల్‌నాయక్ అన్నారు. మండలపరిధిలోని గోరిగడ్డ తాండగ్రామ పంచాయతీ అంతిగాని కుంట తాండకు చెందిన పల్యా బుజి బాయికి ఇందిరమ్మ ఇల్లు మంజురు కావడంతో నిర్మాణం పూర్తి చేసుకుని గృహప్రవేశం నిర్వహించారు. ఈగృహప్రవేశానికి స్థానిక సర్పంచ్ అంబిక లాలు నాయక్‌తో కలిసి వారి దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కాంగ్రెస్‌పార్టీ మండలాధ్యక్షులు గోపాల్‌నాయక్ మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఇందిరమ్మ ఇళ్ల చేపట్టిన పథకం ఇందిరమ్మ ఇల్లు నిర్మాణం పూర్తికావడం లబ్ధిదారులు నూతన గృహప్రవేశం చేయడం ఎంతో సంతోషంగా ఉన్నదన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ రాజు, శంకర్, సినియర్ రాంచందర్ గ్రామ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ సలహాదారుడు హన్మంతరావుకు సత్కారం
**ఘట్‌కేసర్ రూరల్, మే 16, ప్రభాతవార్త:**
తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ గౌరవ సలహాదారుడుగా (బీసీ సంక్షేమ అభివృద్ధిశాఖ)నియమితులైన వి. హన్మంత రావును పోచారం డివిజన్ కాంగ్రెస్ నాయకులు శనివారం కలిసి శాలువా కప్పి అభినందనలు తెలిపారు. డాక్టర్ బీఆర్.అంబేద్కర్ తెలంగాణ సచివాలయంలో వి.హన్మంత రావును పోచారం డివిజన్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి మెట్టు గణేశ్ యాదవ్ కలిసి శాలువాకప్పి అభినందనలు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడుగా నియమితులైన హన్మంతరావు సేవలు రాష్ట్ర ప్రభుత్వానికి ఎంతో అవసరమని అన్నారు. బీసీవర్గాల సంక్షేమం, అభ్యున్నతికి మరింత దోహదపడుతాయని ఆశాభావం వ్యక్తంచేశారు. హన్మంతరావును కలిసిన వారిలో డివిజన్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి గణేశ్‌యాదవ్‌తో పాటు కాంగ్రెస్ నాయకులు సహదేవ్ గౌడ్, పి. లక్ష్మణ్ గౌడ్‌లున్నారు.

## ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత
ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

**కేశంపేట, మే 16, ప్రభాతవార్త:**
కేశంపేట మండలకేంద్రంలో ఆంజనేయస్వామి ఆలయంలో అమావాస్య పురస్కరించుకొని హనుమాన్‌చాలీసా పారాయణం అత్యంత భక్తిశ్రద్ధలతో కన్నులపండుగగా భక్తి పారావశ్యంతో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు మహిళలు యువకులు, గ్రామస్తులు, చిన్నారులు భారీ సంఖ్యలో తరలివచ్చి ఏకతాటిగా 40సార్లు హనుమాన్ చాలీసా పారాయణం చేయడంతో ఆలయ ప్రాంగణం మారుమోగింది. స్వామివారికి ప్రత్యేకపూజలు నైవేద్యాలు సమర్పించారు. ఇలాంటి కార్యక్రమాలు చేయడంద్వారా మానసికప్రశాంతత పెంపొందుతుందని పలువురు అభిప్రాయం వ్యక్తంచేశారు. ఈకార్యక్రమంలో సర్పంచ్ ముత్యం సంతోషా శ్రీశైలంయాదవ్, ఆలయచైర్మన్ పిల్లి అప్రేష్, వార్డు సభ్యులు హంసమ్మ, నాగేష్, పోలేమోని సతీష్‌ముదిరాజ్, వెంకట్‌రెడ్డి, బాల్రెడ్డి, కిషన్, జి. చెన్నంపల్లి లక్ష్మయ్య, దోనూరు శ్రీరాములు, అలివేలమ్మ, ప్రేమలత జూలపల్లి అనసూయముదిరాజ్, నిర్ధావెల్లి ఆంజనేయులు గుప్త, మహిళలు, చిన్నారులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## దోస్త్ ఐడితో నేరుగా డిగ్రీ కోర్సుల్లో ప్రవేశం
**షాద్‌నగర్, మే 16, ప్రభాతవార్త:**
షాద్‌నగర్ తెలంగాణ గిరిజన సంక్షేమ డిగ్రీ, ఇంటిగ్రేటెడ్ బీజీ కెమిస్ట్రీ మహిళల కళాశాలలో సెకండ్ ఫేస్ అడ్మిషన్లను ప్రారంభించినట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ నీత తెలిపారు. దీనికి సంబంధించి దోస్తు ఐడి కార్డుతో విద్యార్థులు నేరుగా కళాశాలకు వస్తే డిగ్రీ కోర్సుల్లో ప్రవేశం పొందే అవకాశం కల్పిస్తున్నట్టు తెలిపారు. ఆన్లైన్ ప్రక్రియ ద్వారా కళాశాలలో అడ్మిషన్ పొందేందుకు అవకాశం ఉందని వివరించారు. దోస్తు గుర్తింపు కార్డు ఉన్న విద్యార్థులు తక్షణమే కళాశాల సంప్రదించాలని కోరారు. విద్యార్థులు మీసేవ లేదా ఆన్లైన్‌సెంటర్లలో ఎలాంటి ఫీజులు చెల్లించవద్దని నేరుగా రిజిస్ట్రేషన్లు కళాశాలలోనే చేసుకోవాలని సూచించారు. ఎస్టీలకు మాత్రమే సీట్లు ఉన్నందున ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రస్తుతం డిగ్రీ ప్రథమ సంవత్సరంలో బిజెడ్, సీఎంజెడ్ సి, బిఏ, బీకాం, ఎంపీసీ, ఎంపీసీఎస్, అదేవిధంగా ఇంటిగ్రేటెడ్ పీజీ కెమిస్ట్రీ కోర్సుల్లో ప్రవేశానికి అవకాశం ఉన్నట్లు తెలిపారు. దరఖాస్తు విషయంలో కళాశాలకు చెందిన 9703441345, 8125214019, 8008590318, 9959525459నెంబర్లలో సంప్రదించాలని కోరారు.

## మున్సిపల్ చైర్మన్‌కు వినతిపత్రం ఇస్తున్న సిపిఎం నేతలు
**శామీర్‌పేట, మే 16, ప్రభాతవార్త:**
జగ్గంగూడ గ్రామ మాజీ సర్పంచు చెవ్వ సత్యనారాయణ అనారోగ్యంతో ఉండి మృతిచెందారు. మూడుచింతలపల్లిమండలంలోని జగ్గంగూడగ్రామ మాజీ సర్పంచ్‌గా చెవ్వ సత్యనారాయణ ఐదేళ్ల పాటు పని చేసి ప్రజలకు సేవలు అందించారు. గ్రామాభివృద్ధికి, ప్రజాసమస్యల పరిష్కారానికి కృషి చేశారని ఆయన గ్రామానికి అందించిన సేవలు చిరస్మరణీయమని పలువురు పేర్కొన్నారు. మాజీసర్పంచ్ చెవ్వ సత్యనారాయణ మృతిపట్ల పలువురు ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు, గ్రామప్రజలు ప్రగాఢసంతాపం తెలియజేశారు. జగ్గంగూడలో ఆయన అంత్యక్రియలు నిర్వహించారు. దీనిలో పలువురు ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

## అంత్యక్రియలకు ఆర్థిక సహాయం
**కుల్కచర్ల, మే, 16 ప్రభాతవార్త:** నిరుపేద కుటుంబాలకు అండగా ఉంటామని బిఆర్‌ఎస్ నియర్ నాయకులు వెంకటేష్ అన్నారు. మండల ఘణపూర్ గ్రామ పంచాయతీ గోప్యానాయక్ తాండకు చెందిన బామిని బాయి ఆనారోగ్యంతో మృతి చెందింది. విషయం తెలుసున్న బిఆర్‌ఎస్ నియర్ నాయకులు వెంకటేష్ గ్రామ సర్పంచ్ రవీందర్ మరియు నాయకులతో కలిసి బామిని బాయి మృతదేహనికి పూలమాలవేసి నివాళులు ఆర్పించారు. అనంతరం వారి కటుంబాని పరమర్శించింది అంత్యక్రియల నిమిత్తం రూ. 5వేలు ఆర్థిక సాయం చేశారు. ఈ సందర్భంగా బిఆర్‌ఎస్ నియర్ నాయకులు వెంకటేష్ మాట్లాడుతూ నిరుపేదలను అదుకోవడమే తమ లక్ష్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్‌ఎస్ సినియర్ నాయకులు గణేష్, చందు, హన్మనాయక్ తదితరులు పాల్గొన్నారు.

## గన్నీ బస్తాల కొరత లేదు
**కుల్కచర్ల, మే, 16 ప్రభాతవార్త :** ధాన్యం కొనుగోలును వేగవంతం చేయాలని మార్కెట్ కమిటి చైర్మన్ ఆంజనేయులు ముదిరాజ్ సూచించారు. శనివారం మండల కేంద్రంలోని మార్కెట్ యార్డులో జరుగుతున్న కొనుగోళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...రైతులకు ఇబ్బంది లేకుండా ధాన్యం కొనుగోలు చేయాలని సూచించారు. రైతులు గన్నీ బస్తాల కోసం అందళన చెందవద్దన్నారు. గన్ని బస్తాల కొరత లేదని స్పష్టం చేశారు.

## కోలాటం పోటీలలో విద్యార్థుల ప్రతిభ
**జిల్లేడు చౌదరిగూడెం, మే 16, ప్రభాతవార్త:**
జిల్లేడు చౌదరగూడెం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు రంగారెడ్డి జిల్లాలో నిర్వహించిన పలు పోటీలలో తమ ప్రతిభ చాటారు. ఇందులో భాగంగా నిర్వహించిన కోలాటం పోటీలలో మొదటి స్థానంలో నిలిచినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సునీత తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులకు జిల్లా విద్యాధికారి సుసింద్రా రావు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉపాధ్యాయులు గ్రామస్తులు అభినందించారు.

## నేడు ఎస్సీ కార్పొరేషన్ ఇంటర్వ్యూలు
**జిల్లేడు చౌదరి గూడెం, మే 16, ప్రభాతవార్త:**
జిల్లేడు చౌదరి గూడెం మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన అభ్య ర్థులకు ఎస్సీ కార్పొరేషన్ ఇంటర్వ్యూలు సోమవారం నిర్వహిస్తున్నట్లు ఎంపిడివో ప్రవీణ్ కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లు తీసుకొని హాజరుకావాలని పేర్కొన్నారు. ఇంట ర్వ్యూలు మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉదయం 11 గంటలకు ఇంటర్వ్యూలు ప్రారంభమైతాయని వివరించారు.

## బస్టాండ్ హనుమాన్ ఆలయంలో అమావాస్య అన్నదాన కార్యక్రమం

**నర్సాపూర్, మే 16, ప్రభాతవార్త:**
నర్సాపూర్ పట్టణంలోగల బస్టాండ్ హనుమాన్ ఆలయంలో జేష్ఠమాస అమావాస్య పర్వదినాన్ని పురస్కరించుకొని ప్రసన్నాంజనేయస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమావాస్య అన్నదాన కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. శ్రీప్రసన్నాంజనేయస్వామికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు, అన్నదాన కార్యక్రమం శ్రీభవాని ప్రథమ చికిత్స కేంద్రం నిర్వాహకులు అన్నదాత డాక్టర్ హైమావతి లక్ష్మణ్‌గౌడ్ కుటుంబ సభ్యులచే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ పూజారి, రాజ పురోహితులు బ్రహ్మశ్రీ గౌడిచర్ల హరిప్రసాద్ శర్మ వేద మంత్రోచ్ఛారణల మధ్యన నవగ్రహ పూజ, గణపతి పూజ, శివ పూజ వంటి పూజ కార్యక్రమాలతో పాటు శ్రీప్రసన్నాంజనేయస్వామికి అభిషేకం, పంచామృతాభిషేకం, సింధూర లేపనం వంటి ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరిగాయి. అనంతరం మధ్యాహ్నం అన్నదాతలు డాక్టర్ మరక హైమావతి లక్ష్మణ్‌గౌడ్ కుటుంబ సభ్యులచే నిర్వహించబడిన అన్నదాన కార్యక్రమం ప్రారంభించగా, భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు. నర్సాపూర్ బస్టాండ్ హనుమాన్ ఆలయంలో ప్రతినెల అమావాస్య రోజున అమావాస్య అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించడం విశేషం. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు తదితరులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

## డెంగ్యూ వ్యాధిపట్ల అప్రమత్తంగా ఉండాలి



అవగాహన ర్యాలీలో పాల్గొన్న అధికారులు

**పెద్దశంకరంపేట, మే 16, ప్రభాతవార్త:**
డెంగ్యూ వ్యాధి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ షఫియోద్దీన్, పట్టణ సర్పంచ్ జంగం రేణుక శ్రీనివాస్ అన్నారు. శనివారం ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో జాతీయ డెంగ్యూ దినోత్సవం సందర్భంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డెంగ్యూ వ్యాధి దోమల వల్ల వస్తుందని పరిసరాల పరిశుభ్రత పాటిస్తే దోమలను నివారించవచ్చు అన్నారు. దోమల నివారణతో డెంగ్యూ వ్యాధిని అరికట్టవచ్చున్నారు.. ఇంటి చుట్టుప్రక్కల నీరునిలువలేకుండా చూసుకోవాలన్నారు. నీరునిల్వ ఉండే తొట్టెలు,డ్రమ్ముల పైన మూతలు ఉంచాలన్నారు. ఈ కార్యక్రమంలోప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది, ఆరోగ్య కార్యకర్తలు, ఆశావర్కర్లు, అంగన్‌వాడీ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## జనగణనపై సాంస్కృతిక కార్యక్రమాలతో అవగాహన


అవగాహన కల్పిస్తున్న కళాకారుల దృశ్యం

**అక్కన్నపేట, మే 16, ప్రభాతవార్త:**
జనగణన-2027 కార్యక్రమంపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు శనివారం అక్కన్నపేట మండల కేంద్రంలోని బస్టాండ్ వద్ద సమాచార పౌర సంబంధాల శాఖ ఆధ్వర్యంలో తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు ప్రత్యేక వాహనం ద్వారా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమం జిల్లా కలెక్టర్, జిల్లా ప్రధాన జనగణన అధికారి ఆదేశాలమేరకు నిర్వహించబడింది. ఈసందర్భంగా కళాకారులు మాట్లాడు తూ భారతదేశ జనగణన 2027 కార్యక్రమంలో భాగంగా ఈ నెల 11వ తేదీ నుంచి జూన్ 11వ తేదీ వరకు జనగణన ఎన్యుమరేటర్లు ఇంటింటికి తిరిగి జనాభా వివరాలను సేకరిస్తారని తెలిపారు. ప్రజలు వారికి పూర్తి సహకారం అందించి కుటుంబసభ్యుల వివరాలను సరైనవిధంగా తెలియజే యాలని కోరారు. జనాభాలెక్కలు దేశాభివృద్ధికి ఎంతో ఉపయోగపడతా యని, ప్రజాసంక్షేమ అభివృద్ధి కార్యక్రమాల రూపకల్పనలో కీలకపాత్ర పోషిస్తా యని వివరించారు. ప్రతికుటుంబం తమవివరాలను కచ్చితంగా నమోదు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో తెలంగాణ సాంస్కృతిక సారథి స్నేహబృందం, రాజేష్‌బృందం సభ్యులు పాల్గొన్నారు.

## అటవీ పరిశుభ్రత కార్యక్రమం



కార్యక్రమంలో అటవీశాఖ అధికారులు, వాలంటీర్లు తదితరులు

**నర్సాపూర్, మే 16, ప్రభాతవార్త:**
నర్సాపూర్ అటవీశాఖ ఆధ్వర్యంలో అటవీపరిశుభ్రత కార్యక్రమాన్ని నిర్వహించినట్లు నర్సాపూర్ అటవీశాఖ రేంజ్ అధికారిణి దివ్య తెలిపారు. శనివారం నర్సాపూర్ అటవీపరిధిలో అటవీశాఖ, సేవ్ వాటర్ అండ్ నేచర్ స్వచ్ఛందసంస్థ సంయుక్త ఆధ్వర్యంలో కాసిలా ఫార్మ్స్ నుండి నర్సాపూర్ ఫారెస్ట్ అర్బన్ పార్క్ వరకు అటవీపరిశుభ్రత కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో అటవీశాఖ రేంజ్ అధికారిణి దివ్యతోపాటు, ఎఫ్ఎస్ఓ సాయిరామ్, ఎఫ్ఎస్ఓ కరీముద్దీన్, ఎఫ్ఎస్ఓ రాజమని, ఎఫ్ఎస్ఓ శ్రీధర్, ఎఫ్‌బీఓ గోపాల్, ఎఫ్‌బీఓలు, అర్బన్ పార్క్ సిబ్బంది, బేస్‌క్యాంప్‌సిబ్బంది, ఎస్‌డబ్ల్యూఏఎన్ సంస్థ వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

## పాలిటెక్నిక్‌కు కౌన్సిలింగ్ హెల్ప్‌లైన్ సెంటర్

**హుస్నాబాద్ రూరల్, మే 16, ప్రభాతవార్త:**
ఈ విద్యాసంవత్సరంలో పదో తరగతి పూర్తి చేసి పాలిటెక్నిక్ కోర్సుల్లో ప్రవేశం పొందబోయే విద్యార్థులకు ప్రభుత్వం ఊరటనిచ్చే నిర్ణయం తీసుకుంది. ప్రభుత్వ పాలిటెక్నిక్ హుస్నాబాద్‌కు పాలిసెట్ కౌన్సిలింగ్ హెల్ప్‌లైన్ సెంటర్ మంజూరైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ పంచదార శ్రీదేవి తెలిపారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ హుస్నాబాద్, పరిసరప్రాంత విద్యార్థులు కౌన్సిలింగ్‌కోసం దూరప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరంలేకుండా, స్థానికంగానే సర్టిఫికెట్ వెరిఫికేషన్ పూర్తిచేసుకునే అవకాశం కల్పించడం సంతోషకరమన్నారు. ఈ నెల 28 నుంచి ప్రారంభమయ్యే మొదటి విడత పాలిసెట్ కౌన్సిలింగ్‌కు హాజరయ్యే విద్యార్థులు ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాలు, పాలిసెట్ అడ్మిట్ కార్డు, ర్యాంక్ కార్డు తదితర అవసరమైన పత్రాలతో ప్రభుత్వ పాలిటెక్నిక్ హుస్నాబాద్‌లో హాజరై సర్టిఫికెట్ వెరిఫికేషన్ చేయించుకోవాలని సూచించారు. పూర్తి వివరాలకు కళాశాలను లేదా హెల్ప్‌లైన్ నంబర్లు 9849557728, 7997278636లను సంప్రతించాలని తెలిపారు.

## పెరిగిన పెట్రోల్, డీజిల్ ధరలను తగ్గించాలి



ఆటోను తాళ్లతో లాగుతున్న దృశ్యం

**బెజ్జంకి, మే 16, ప్రభాతవార్త:**
కేంద్ర సర్కార్ పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలతో పేదప్రజలపై మరింత భారం పడిందని సిపిఐ మండల కార్యదర్శి బోనగిరి రూపేష్ అన్నారు. పెట్రోల్, డీజిల్ ధరల పెంపును నిరసిస్తూ శనివారం సిపిఐ మండలశాఖ ఆధ్వర్యంలో మండలకేంద్రంలో ఆటోను తాళ్లతోలాగుతూ ఆందోళన చేపట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పెరుగుతున్న ధరల వలన రవాణారంగం, రైతులు, సామాన్యప్రజానీకం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కేంద్ర సర్కార్ పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలను వెంటనే తగ్గించాలని డిమాండ్‌చేశారు. కార్యక్రమంలో పార్టీనాయకులు బోనగిరి మహేందర్, సంగెం మధు, కల్లూరి బాలమల్లు, బోనగిరి శ్రవణ్, దొంతరవేణి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## రైస్ మిల్లులను పరిశీలించిన తహసీల్దార్


రైస్ మిల్లును పరిశీలిస్తున్న తహసీల్దార్

**బెజ్జంకి, మే 16, ప్రభాతవార్త:**
మండల పరిధిలోని కొనుగోలు కేంద్రాల నుంచి మిల్లులకు తరలించిన వరి ధాన్యం అన్‌లోడింగ్ ప్రక్రియను తహసీల్దార్ శ్రీకాంత్ శనివారం క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. మండలంలోని తోటపల్లి, గుగ్గిళ్లలోని మిల్లులను పరిశీలించారు. రైతులు ఇబ్బంది పడకుండా దిగుమతి పనులను వేగవంతం చేయాలన్నారు. కొనుగోలుకేంద్రాల్లో నిల్వలు పేరుకుపోకుండా ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నామన్నారు. ఆయన వెంట సిబ్బంది రజిత, రమేష్, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

## విజయవంతమైన ఉచిత మెగా కంటివైద్య శిబిరం


ఉచిత మెగా కంటివైద్య శిబిరంలో పాల్గొన్న ఆవుల రాజిరెడ్డి

**వెల్దుర్తి, మే 16, ప్రభాతవార్త:**
ప్రజా సేవకుడు రాజన్న ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం నాడు మండల కేంద్రమైన వెల్దుర్తి లోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో ఉచిత మెగా కంటి వైద్య శిబిరాన్ని నర్సాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జ్ టిపిసిసి కార్యదర్శి ఆవుల రాజిరెడ్డి ప్రారంభించారు. తన సొంత నిధులతో రాజన్న పౌండేషన్ ఆధ్వర్యంలో కంటి వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిబిరానికి వాసన్ కంటి ఆసుపత్రి హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ కంటి వైద్య నిపుణులు, సర్జన్లు ఆధునిక పరికరాలతో ఉచిత కంటివైద్య శిబిరం నిర్వహించారు. కంటి శుక్లం, మెల్లకన్ను, గ్లాకోమా, రెటీనాసమస్యలు, దూరదృష్టి, దృష్టిలోపం ఉన్నవారికి తగిన వైద్య సూచనలు ఇచ్చారు. ఉచితంగా శాస్త్ర చికిత్సలు నిర్వహించి కార్పొరేషన్ ఆస్పత్రిలో ఆపరేషన్ నిర్వహించి రోగులకు రవాణా, భోజనం వసతి సౌకర్యాలు పూర్తిగా ఉచితంగా కల్పిస్తుందని అన్నారు. శస్త్ర చికిత్సలు, అవసరం అయిన మందులు, నాణ్యమైన కళ్లద్దాలను కూడా ఉచితంగా అందజేశామన్నారు. మెగా ఉచిత కంటివైద్య శిబిరానికి పలు గ్రామాల నుంచి వందలాదిగా ప్రజలు తరలివచ్చారు. ఈసందర్భంగా ఆవుల రాజిరెడ్డి మాట్లాడుతూ, పేద, మధ్యతరగతి ప్రజలకు కార్పొరేట్ స్థాయి వైద్యం అందుబాటులోకి తేవడమే రాజన్న ఫౌండేషన్ లక్ష్యమని ఆయన తెలిపారు. భవిష్యత్తులో నియోజకవర్గంలోని అన్నిమండలాల్లో ఇలాంటి వైద్యశిబిరాలు నిర్వహిస్తామని హామీ ఇచ్చారు. శిబిరం సజావుగా సాగేందుకు రాజన్న ఫౌండేషన్ వాలంటీర్లు స్థానిక నాయకులు విస్తృత ఏర్పాట్లు నిర్వహించారు. జిల్లా అధికార ప్రతినిధి మహేష్‌రెడ్డి, వైస్ ఎంపీపీ సుధాకర్‌గౌడ్, రాష్ట్ర ఫిషర్మెన్ కార్యదర్శి తలారి మల్లేశం, మాజీ అధ్యక్షుడు నరసింహారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు హనుమంతరెడ్డి, నరేందర్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు మల్లేశం, నాయకులు కిష్టాగౌడ్, శంకర్‌గౌడ్, శేఖర్‌గౌడ్, ఆయా గ్రామాల ఫౌండేషన్ ప్రతినిధులు, వైద్య సిబ్బంది, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# లారీలు రాక.. ధాన్యం పోక.. అన్నదాత వెతలు

### -మండుటెండలో రైతుల ధర్నా



రహదారిపై ఆందోళన చేస్తున్న రైతులు

**చిన్నశంకరంపేట, మే 16, ప్రభాతవార్త:**
అన్నదాత ఆరుగాలం కష్టపడి పండించిన పంట అమ్ముకోవాలంటే నానాతిప్పలు పడాల్సి వస్తుంది. పంట చేతికి వచ్చే వరకు ఒక బాధ ఉంటే తీరా పంట చేతికి వచ్చిన తరువాత మరో బాధలు రైతులను వెంటాడుతున్నాయి. మండల పరిధి అంబాజీపేటవద్ద మెదక్-చేగుంట ప్రధానరహదారిపై మండుటెండలో రైతులు శనివారం ఆందోళన చేపట్టారు. ధాన్యం కొనుగోలుకేంద్రం ప్రారంభించి నెల రోజులు గడుస్తున్నప్పటికీ వారికి ఒక లారీ చొప్పున కేవలం నాలుగు లారీలను మాత్రమే పంపించారని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ధాన్యం తూకంచేసి పదిరోజులు గడుస్తున్నప్పటికీ పట్టించుకునేవారు లేరన్నారు. గత 20 రోజులుగా ధాన్యాన్ని కొనుగోలు కేంద్రానికి తరలించి ధాన్యం కుప్పల వద్దే ఉంటున్నామని, అధికారులు కూడ కొనుగోలు కేంద్రాలకు వచ్చి ఫోటోలు దిగిపోతున్నారని, లారీల గురించి, కొనుగోలు కేంద్రాల వద్ద ఉన్న సమస్యలపై ఆరా తీయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ధాన్యం తరలింపులో ప్రభుత్వం విఫలమైందన్నారు. అధికారులు, ప్రభుత్వం స్పందించి కొనుగోలు కేంద్రాలకు లారీలను పంపాలని వారు డిమాండ్ చేశారు. రహదారిపై రైతులు ఆందోళన చేస్తున్న విషయం తెలుసుకున్న ఇంచార్జి తహసీల్దార్ మహేందర్‌గౌడ్, ఆర్ఐ రాజులు రైతులతో మాట్లాడి రోజుకు ఒకలారీ చొప్పున పంపించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. రహదారిపై రైతులు ధర్నా చేయడంతో రోడ్డుకు ఇరువైపులా వాహనాలు భారీ సంఖ్యలో నిలిచిపోయాయి. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

# కొనుగోళ్లు సజావుగా సాగేందుకు భద్రతా ఏర్పాట్లు

### -సిపి సాధన రష్మీ పెరుమాళ్

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:**
జిల్లాలో ప్రస్తుతం కొనసాగుతున్న ధాన్యం కొనుగోలు సీజన్‌ను దృష్టిలో పెట్టుకొని రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ధాన్యం కొనుగోలు, రవాణా, అన్‌లోడింగ్ ప్రక్రియలు సజావుగా సాగేందుకు జిల్లా వ్యాప్తంగా విస్తృత భద్రతా ఏర్పాట్లు చేసినట్లు సిపి సాధన రష్మీ పెరుమాళ్ తెలిపారు. శనివారం ఆమె జిల్లా వ్యాప్తంగా పలు కొనుగోలు కేంద్రాలు, రవాణా మార్గాలు, రైస్ మిల్లులను స్వయంగా సందర్శించి భద్రతా ఏర్పాట్లను సమీక్షించారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియ ప్రశాంతంగా ఎటువంటి ఆటంకాలు లేకుండా కొనసాగాలని రైతులకు అన్ని విధాల సహకారం అందించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సున్నితమైన సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక దృష్టిసారించినట్లు తెలిపారు. ధాన్యం కొనుగోలు రవాణా, అన్‌లోడింగ్ సమయంలో ఎటువంటి ఇబ్బందులు రాకుండా కొనుగోలు కేంద్రాలు, వివిధ రవాణా మార్గాల వద్ద పోలీసులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సిపి సాధన రష్మీ పెరుమాళ్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.


ధాన్యం కొనుగోలు తీరును అడిగి తెలుసుకుంటున్న సిపి రష్మీ పెరుమాళ్

## గోశాలలో గోవులకు ప్రత్యేక పూజలు


గోవుకు పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

**గజ్వేల్ టౌన్, మే 16, ప్రభాతవార్త:**
గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధి క్యాసారంలోని గోశాలలో శనివారం పెద్ద అమావాస్య సందర్భంగా గోవులకు నిర్వాహకులు మర్యాల శ్రీనివాస్, బొగ్గుల సురేష్‌తో పాటు బాబులాల్ కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ ఆవులను రక్షించాలని వాటిని కబేలాలకుతరలించకుండా గోశాలకుపంపి సంరక్షించాలని విజ్ఞప్తిచేశారు. గోశాల అంటే గోవులకు ఆశ్రయం కాగా వయసైపోయిన, పాలివ్వలేని, రోడ్డున పడ్డ, కబేళాకు తరలిపోతున్న గోవులను కాపాడి వాటికి కడుపునిండామేత, ఉండటానికినీడ కల్పించే పుణ్యక్షేత్రం అన్నారు. కార్యక్రమంలో రాంబాబు, బుచ్చిరెడ్డి, నరసింహ, రాఘవేందర్ పాల్గొన్నారు.

## అనంతరావుపల్లిలో కొనుగోలు కేంద్రం

**గజ్వేల్ టౌన్, మే 16, ప్రభాతవార్త:**
గజ్వేల్ మండలం అనంతరావుపల్లి గ్రామంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సర్పంచ్ దావనమైన సులోచన మల్లేష్‌యాదవ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు తమ పంటను సకాలంలో ప్రభుత్వ మద్దతు ధరకు విక్రయించుకునేందుకు ఈకొనుగోలుకేంద్రం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని సౌకర్యాలు కల్పించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డిబిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి దాసరి ఏగొండస్వామి, ఉపసర్పంచ్ బైరం రమేష్, వార్డుమెంబర్లు దార మల్లేశ్, దావనమైన కుమార్, మాదుగారి రమాకాంత్, గ్రామస్తులు దావుగారి యాదం, మల్కనగారి బాల్‌కుమార్, శంకర్, రాజయ్య, హమాలీ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

## కొనుగోలు కేంద్రాలలో రాజకీయాలు చేయొద్దు

### -ఎఎంసి చైర్మన్ మహేందర్‌యాదవ్


కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న ఎఎంసి చైర్మన్ మహేందర్

**చిన్నకోడూరు, మే 16, ప్రభాతవార్త:**
మండల పరిధిలోని కిష్టాపూర్ గ్రామ ఐకెపి వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎఎంసి చైర్మన్ మీసం మహేందర్ యాదవ్ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కొనుగోలు కేంద్రాలలో ఎలాంటి రాజకీయాలు చేయకుండా పారదర్శకంగా కొనుగోలు జరిగేలా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. ఆయన వెంట ఎఎంసి డైరెక్టర్లు, సీసీ, పార్టీ నాయకులు సందెబోయిన పర్శరాం, వైకుంఠం, కొలనుపాక శ్రీనివాస్‌రెడ్డి, ఉడుత జయంత్, ఉడుత ప్రశాంత్, ఐలయ్య, పర్శరాములు, స్వామి తదితరులు పాల్గొన్నారు.

## పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలను వెంటనే తగ్గించాలి

### -మాజీ ఎఎంసి చైర్మన్ కాముని శ్రీనివాస్


విలేకరులతో మాట్లాడుతున్న బిఆర్ఎస్ నాయకులు

**చిన్నకోడూరు, మే 16, ప్రభాతవార్త:**
పెట్రోల్, డీజిల్ ధరలు పెంచి సామాన్య ప్రజల పై మరోసారి కేంద్ర సర్కార్ పెను భారాన్ని మోపిందని బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు, మాజీ ఎఎంసి చైర్మన్ కాముని శ్రీనివాస్ అన్నారు. చిన్నకోడూరు మండల కేంద్రంలో ఆయన శనివారం మాజీ ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు జంగిటి శ్రీనివాస్, కాముని ఉమేష్‌చంద్ర, కాల్వ ఎల్లయ్యతో కలిసి విలేకరులతో మాట్లాడారు. పెట్రోల్, డీజిల్ ధరలు పెంచడం వలన భారం పేద మధ్యతరగతి ప్రజలతో పాటు రైతులపై పడుతుందన్నారు. కేంద్రంలోని మోదీ సర్కార్ ధరలు పెంచి ప్రజలపై భారం మోపుతుంటే సిఎం రేవంత్‌రెడ్డి మౌనంతో మద్దతు తెలుపుతున్నాడని మండిపడ్డారు. పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలను వెంటనే తగ్గించాలని లేనియెడల బిఆర్ఎస్ అధిష్ఠానం ఆదేశాల మేరకు ఆందోళనలు చేస్తామన్నారు.

## కొనుగోలు కేంద్రాలు సందర్శించిన ఎఓ

**చిలిపిచెడ్, మే 16, ప్రభాతవార్త:**
మండల పరిధిలోని సోమక్కపేట గ్రామంలో వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు ఏర్పాట్లు చేసిన వరి కొనుగోలు కేంద్రాలను మండల వ్యవసాయ అధికారి రాజశేఖర్ గౌడ్ శనివారం కొనుగోలు కేంద్రాలను సందర్శించడం జరిగిందని అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు దళారుల చేతిలో మోసపోకుండా ప్రభుత్వం ఏర్పాటుచేసిన కొనుగోలుకేంద్రాల్లో ధాన్యం అమ్మాలని సూచించారు. ధాన్యంలో తేమ శాతం 17శాతం మించి ఉండరాదని, ధాన్యం ఆరిన తర్వాత తాళ్ళు, మట్టిపెళ్ళలు లేకుండా నాణ్యమైన విత్తనాన్ని మాత్రమే కొనుగోలు చేయాలని, వరి చివరిగింజవరకు కొనుగోలు చేస్తామని రైతులు దిగులు పడవద్దని సూచించారు. కార్యక్రమంలో గ్రామసర్పంచ్ దుర్గాచలం, సెంటర్ ఇన్చార్జి నరేష్ పిఏసిఎస్ డైరెక్టర్ సుభాష్, రైతులు ఈశ్వర్, కుమార్, పిఏసిఎస్ సిబ్బంది, నర్సింలు, మల్లేష్, గణేష్, తదితరులు పాల్గొన్నారు.

## డెంగ్యూవ్యాధిపై అవగాహన కార్యక్రమం

### -పిహెచ్‌సి డాక్టర్ సారిక



డెంగ్యూ వ్యాధి నివారణ దినోత్సవం జరుపుకుంటున్న దృశ్యం

**అల్లాదుర్గం, మే 16, ప్రభాతవార్త:**
డెంగ్యూవ్యాధి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డాక్టర్ సాకి తెలిపారు. జాతీయ డెంగ్యూ నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలకేంద్రమైన అల్లాదుర్గంలోని ఆసుపత్రిలో ఆయాశాఖల అధికారులతో డెంగ్యూ నివారణ ప్రత్యేక సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సారిక మాట్లాడుతూ రాబోయే వర్షాకాలంను దృష్టిలో పెట్టుకుని గ్రామాల్లో పరిసరాలను, పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. డెంగ్యూవ్యాధి నిర్మూలించాలంటే మురికి నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వ్యాధిపై ప్రతి ఒక్కరు అవగాహన పొంది ఉండాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ మద్దూరి సౌమ్య, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ నాగమణి, పంచాయతీ కార్యదర్శి ప్రభాకర్, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## బిఎంఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షునికి ఘన సన్మానం


మరాఠి కృష్ణమూర్తిని సన్మానిస్తున్న కప్పర ప్రసాద్‌రావు

**గజ్వేల్ టౌన్, మే 16, ప్రభాతవార్త:**
తెలంగాణ రాష్ట్ర పవర్ ఎంప్లాయీస్ యూనియన్ (బిఎంఎస్) రాష్ట్ర ఉపాధ్యక్షులుగా ఇటీవల ఎన్నికైన మరాఠి కృష్ణమూర్తిని గజ్వేల్‌లోని వారి నివాసంలో బిజెపి అధికార ప్రతినిధి కప్పర ప్రసాద్‌రావుతో పాటు పలువురునాయకులుకలిసి ఘనంగాసన్మానించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో ఉద్యోగుల సమస్యలు, సంఘ బలోపేతం, భవిష్యత్ కార్యాచరణపై చర్చించారు. కార్యక్రమంలో తెలంగాణ జర్నలిస్టు యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బింగి స్వామి, జిల్లా ప్రధాన కార్యదర్శి తూర్పింటి శ్రీను, జిల్లా ఉపాధ్యక్షుడు బాలు భూపతిరాజు, గజ్వేల్ నియోజకవర్గ అధ్యక్షులు గుడాల శేఖర్, ప్రధాన కార్యదర్శి ఎల్లంరాజు, రాష్ట్ర నాయకులు సిద్ధాల రవి, బైరి ప్రభాకర్‌లు పాల్గొన్నారు.

## పెంచిన పెట్రోల్ డీజిల్ ధరలు తగ్గించాలి

### -కమ్యూనిస్టులు లీడర్ చిరంజీవి


మాట్లాడుతున్న కమ్యూనిస్టు నాయకులు

**నారాయణఖేడ్, మే 16, ప్రభాతవార్త:**
కేంద్ర ప్రభుత్వం పెంచిన పెట్రోల్ డీజిల్ గ్యాస్ ధరలు తగ్గించాలని ఇది పేదల పైన మోయలేని భారం అని కమ్యూనిస్టు నాయకులు చిరంజీవి అన్నారు. కేంద్ర ప్రభుత్వం పేద ప్రజలకు నడ్డిని విచ్చే విధంగా పెట్రోల్ డీజిల్ గ్యాస్ ధరలు ఉన్నాయన్నారు. ఇప్పటికే సామాన్యుడు కొనలేని పరిస్థితిలో అనేక వస్తువులు ఉన్నాయన్న ప్రభుత్వం పెంచిన పెట్రోల్ గ్యాస్‌ధరలు వెంటనే తగ్గించేవిధంగా చర్యలుచేపట్టాలన్నారు. కార్యక్రమంలో అంబేద్కర్ పూలే సంఘం డివిజన్ అధ్యక్షులు నర్సింలు, మోహన్, బాలు, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

## సాగు పద్ధతులపై రైతులకు అవగాహన


రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

**కొండపాక, మే 16, ప్రభాతవార్త:**
రానున్న వానకాలంసాగుకై రైతులను సమాయత్తంచేయడానికి మెరుగైన సాగుపద్ధతులపై రైతులకు వ్యవసాయశాఖ సహకారంతో కుకునూరుపల్లి రైతువేదికలో రైతుముంగిట్లో శాస్త్రవేత్తలు అనే కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా డాక్టర్ డి.స్వేత మాట్లాడుతూ రైతులకు మార్కెట్‌లో డిమాండ్ ఉన్న వివిధరకాల వరి వంగడాలను వివరించారు. కెఎన్ఎం 1638, బిపిటి 5204, డబ్ల్యుజిఎల్ 44 రకాలు సాగుకు అనుకూలమని తెలిపారు. కుకునూరుపల్లి వ్యవసాయధికారి గోవిందరాజు మాట్లాడుతూ నాణ్యమైన విత్తనాల వాడకం వాటి ఉపయోగం, లింగకర్షక బుట్టల ఉపయోగాలు, వరిలో మొగి పురుగు వల్ల కలిగే నష్టాలు వాటి పరిష్కారమార్గాలను ఆయన సూచించారు. కార్యక్రమంలో కుకునూరుపల్లి మండలపరిధిలోని ఎఈఓలు శ్రీహరి, రమ్యశ్రీ, వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.